# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 170 | హైదరాబాద్ | గురువారం 25-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00





### నేను ఉన్నంత వరకు వారి కుటుంబాన్ని
# అధికారంలోకి రానివ్వను
### ఇదే నా శపథం: సీఎం

- మీ బిడ్డగా ఇదే గడ్డ మీద నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం..కాంగ్రెస్ భవిష్యత్తు అన్న సీఎం..
- నన్ను జైలుకు పంపించి నా వాళ్ళను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య



11లో

### ఆకాశమే హద్దు
# ఇస్రో 'బాహుబలి' ఘన విజయం!

- నింగిలోకి అతిపెద్ద కమ్యూనికేషన్ శాటిలైట్
- అంతరిక్షం నుంచి నేరుగా మొబైల్‌కు ఇంటర్నెట్
- ఢీకొనే ముప్పు తప్పించేందుకు 90 సెకన్ల పాటు నిలిపివేత
- తర్వాత విజయవంతంగా ప్రయోగం

11లో






11లో

### సంక్రాంతికి గ్రామాల్లో
# అన్నా క్యాంటీన్లు

- గ్రామాలలో సంక్రాంతి కానుకగా ప్రారంభం కానున్న 70 అన్న క్యాంటీన్లు
- సంక్రాంతికి క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం
- పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే కొనసాగుతున్న 205 క్యాంటీన్లు

### సర్పంచ్‌లకు తీపి కబురు..
# గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

- సర్పంచ్‌లకు నేరుగా ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామన్న సీఎం
- పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు ప్రకటన
- అర్హులైన వారందరికీ కార్డులు జారీ చేస్తామని హామీ
- పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పిలుపునిచ్చిన సీఎం

11లో



### న్యూ ఇయర్ వేడుకల వేళ..
# హద్దులు దాటితే కఠిన చర్యలు

- న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ
- ఈవెంట్‌లకు పోలీస్ అనుమతి, సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరని వెల్లడి...
- రాత్రి 10 గంటలకే లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లు క్లోజ్ చేయాలని ఆదేశాలు
- ఈ నెల 31న రాత్రి 9 గంటల నుండి డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్న సజ్జనార్

11లో



### గడువులోగా ధాన్యం కొనుగోళ్లు
# పూర్తి చేయాలి: సీఎం ఆదేశం

- ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్న సీఎం..
- ధాన్యం కొనుగోళ్లు సహా వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సీఎం సమీక్ష
- మామిడి రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు సహకరించాలని సూచన
- ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే పల్ప్ యూనిట్లపై కఠిన చర్యలకు ఆదేశం



11లో

### ఆరావళి మైనింగ్‌పై
# వెనక్కి తగ్గిన కేంద్రం..

- ఆరావళి పర్వతాల్లో కొత్త మైనింగ్ లీజులపై పూర్తి నిషేధం విధించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించిన పర్వతశ్రేణికి వర్తింపు
- సుస్థిర మైనింగ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనకు ఐసీఎఫ్ఆర్ఈకి బాధ్యత
- ఇప్పటికే ఉన్న గనులపై మరింత కఠిన నిబంధనలు అమలు



11లో

# వై.ఎస్.జగన్ అక్రమాస్తుల కేసు మళ్లీ మొదటికి



విజయవాడ, డిసెంబర్ 24,

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లోనే కాకుండా, న్యాయ వ్యవస్థలోనూ ఒక సంచలనంగా మారింది. 2011లో ప్రారంభమైన ఈ కేసు విచారణ, అనేక మలుపులు తిరుగుతూ నేటికీ ఒక కొలిక్కి రాలేదు. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. రఘురాం బదిలీ అవ్వడం, ఆయన స్థానంలో కె. పట్టాభిరామారావు నియామకం జరగడంతో ఈ కేసు విచారణ మళ్లీ మొదటికి వచ్చిందనే చర్చ మొదలైంది. ఈ కేసు విచారణ నత్తనడకన సాగడానికి అనేక కారణాలున్నాయి.కేసు విచారణలో ఎదురవుతున్న అతిపెద్ద అవరోధం న్యాయమూర్తుల బదిలీలు. జగన్ అక్రమాస్తుల కేసులో వేల పేజీల డాక్యుమెంట్లు, వందలాది సాక్ష్యాలు, 11 ఛార్జ్‌షీట్లు ఉన్నాయి. ఒక న్యాయమూర్తి ఈ కేసు పూర్వాపరాలను అర్థం చేసుకుని, విచారణను ఒక దశకు తీసుకొచ్చే సమయానికి వారు బదిలీ అవుతున్నారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తి మళ్లీ మొదటి నుండి కేసును అధ్యయనం చేయాల్సి రావడం వల్ల విచారణ ప్రక్రియ నిరంతరం జాప్యం అవుతోంది.సీబీఐ ఈ కేసులో దాదాపు 11 ప్రధాన ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఇందులో పెట్టుబడులు, క్విడ్ ప్రో కో భూ కేటాయింపులు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. నిందితులు తమపై ఉన్న ఆరోపణలను కొట్టివేయాలని కోరుతూ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడం వల్ల ప్రధాన విచారణ ప్రారంభం కావడం లేదు. అంతేకాక, విచారణ జరుగుతున్న ప్రతిసారీ ఏదో ఒక సాంకేతిక కారణాన్ని చూపుతూ అనుబంధ పిటిషన్లు వేయడం వల్ల కోర్టు సమయం వృధా అవుతోంది.కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ , ఈడీ ( లపై కూడా పలు విమర్శలు ఉన్నాయి. విచారణను వేగవంతం చేయడంలో ఈ సంస్థలు విఫలమవుతున్నాయని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేదా వ్యూహాత్మక జాప్యం వల్లనే సీబీఐ కోర్టులో గట్టిగా వాదనలు వినిపించడం లేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలనాపరమైన కారణాలను చూపుతూ వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు పొందేవారు. ప్రధాన నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడం, వారి తరపు న్యాయవాదులు వాయిదాలు కోరడం వల్ల విచారణ ముందుకు సాగడం లేదు. సీబీఐ కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, నిందితులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తీసుకురావడం లేదా విచారణపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల విచారణ ప్రక్రియ నిలిచిపోతోంది. ఒక ఛార్జ్‌షీట్‌పై విచారణ జరుగుతున్నప్పుడు మరొక దానిపై స్టే రావడం వల్ల గందరగోళం ఏర్పడుతోంది.న్యాయమూర్తి కె. పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టడంతో, ఈ కేసు మరోసారి కీలకాంశంగా మారింది. అయితే, కొత్త న్యాయమూర్తి ఈ భారీ కేసును ఎంత వేగంగా అర్థం చేసుకుంటారు, దర్యాప్తు సంస్థలు ఎంతటి సహకారాన్ని అందిస్తాయి అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సామాన్య ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కలగాలంటే, ఇలాంటి కీలక కేసుల్లో విచారణ కాలపరిమితితో కూడి ఉండాలని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

భారత శక్తి

## జెన్ జెడ్ చుట్టూ ప్రపంచం

జన్ జడ్.. ఇటీవల ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో ప్రభుత్వ మార్పుల్లో వీరి ప్రభావం కనిపించింది. ఇదే నేపథ్యంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెన్ జెడ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జెన్ జెడ్ థీమ్‌తో నిర్వహించనున్నారు. యువతను ఆకర్షించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం. ఉద్యోగాలు, పారదర్శకత కోరే జెన్ జెడ్ ప్రజాస్వామ్యంలో మార్పులు తీసుకురాగలదా చూడాలి.ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యూత్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తా సంస్థలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఈ యువత తమ ప్రభావంతో స్థితిగతులను మార్చి వేస్తున్నట్లు కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రపంచం మొత్తం ఈ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నేపాల్ రాజకీయాల్లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూల్చడంలో ఉవని జి యూత్ ఎక్కువగా ప్రభావం చూపిందని తెలుస్తోంది. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన జనసేన సమావేశంలో కూడా ఆ పార్టీ అధినేత మాట్లాడుతూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అన్నారు. దీంతో జెన్ జెడ్ ప్రభావం రాజకీయ రంగంలో ఎంత ఉందో అర్థమవుతుంది. అసలు ఈ జెన్ జెడ్ యూత్ అంటే ఎవరు?1997 నుంచి 2012 వరకు జన్మించిన వారు ఇప్పుడు యవ్వనంలోకి వచ్చారు. వీరిని జెన్ జెడ్ యూత్ అని అంటారు. ఈ యువత ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాను ఉపయోగించడం మాత్రమే కాకుండా తమ అభిప్రాయాలను వెంటనే వ్యక్తం చేయడం.. సామాజిక పరిస్థితులపై విశ్లేషణ చేయడం.. తప్పు, ఒప్పు ల గురించి చర్చించడం తీవ్రమైంది. ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమాజంలో జరిగే పరిస్థితులపై వీరు వెంటనే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాకుండా ఎక్కడ ఏ చిన్న విభిన్న పరిస్థితి ఏర్పడిన దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తారు. ఇలాంటి యూత్ వల్ల ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై ఎక్కువగా ప్రభావం పడుతుందని అంటున్నారు.గతంలో నేపాల్ లో యూట్యూబ్ కంటెంట్ పై పరిమితులు విధించడంపై యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వీరి ఆందోళనతోనే అక్కడి ప్రధాని దేశం విడిచి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంటే సాధారణ ఉద్యమాలకు భిన్నంగా వీరి ఆందోళన తీవ్రతరంగా ఉంటుంది. ర్యాలీలు, సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా సోషల్ మీడియా ద్వారా వీరి ఉద్యమాన్ని ఉధృతం చేస్తారు. ఒక సమాచారాన్ని చాలామందికి చేరవేయడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ లోను అలజడి రేపిన యువత జెన్ జెడ్ యువతదే ఎక్కువ అని అంటున్నారు.తాజాగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనసేన సమావేశంలోనూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అభిప్రాయపడ్డాడు. వచ్చే ఆవిర్భావ సభలో జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించాలని అన్నారు. వీరిని ఉపయోగించుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్నారు. వీరికి ఎక్కువగా ప్రాధాన్యతమిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నట్లు చెప్పారు. అయితే వచ్చే రోజుల్లో కూడా వీరి ప్రభావం మరింతగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మరో వైపు వత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. జెన్–జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్–జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్–జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్–జీ పవర్ అన్నారు.సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. ''రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?" అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం" అన్నారు.

# సిబిఐ వలలో టిడిపి మాజీ ఎంపీ వారసులు!


తిరుపతి, డిసెంబర్ 24,

దివంగత డీకే ఆదికేశవుల నాయుడు పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. ఆయన వారసులు సిబిఐ వలలో పడ్డారు. 2019లో జరిగిన రియల్టర్ రఘునాథ్ అనుమానాస్పద మృతి కేసులో ఆది కేశవులు కుమారుడు డీకే శ్రీనివాస్, కుమార్తె కల్పజాను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరితోపాటు అప్పటి డిఎస్పి మోహన్ ను కూడా అదుపులో తీసుకున్నారు. రఘునాథ మృతి వెనుక ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు ఉన్నాయన్న ఆరోపణలపై సుదీర్ఘ దర్యాప్తు కొనసాగింది. అందులో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయి. రాజకీయంగా దూరంగా ఉన్న డీకే కుటుంబం ఇప్పుడు ఈ ఘటనతో మళ్లీ వెలుగులోకి వచ్చింది.2019 నాటి కేసు ఇది. డీకే ఆదికేశవులు నాయుడుకు సన్నిహితుడు రఘునాథ్. ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మొదట బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో దర్యాప్తును సిబిఐ చేశారు. సుప్రీంకోర్టు సైతం సీబీఐ దర్యాప్తునకు ఓకే చెప్పడంతో రంగంలోకి దిగిన అత్యున్నత విచారణ సంస్థ ఈ కేసులో విచారణ చేపట్టింది. అందుకే కీలక అరెస్టులు జరిపినట్లు తెలుస్తోంది. టిటిడి చైర్మన్ పోస్ట్ తో పాటు తిరుపతి ఎంపీగాను పనిచేశారు డీకే ఆదికేశవులు నాయుడు. సుదీర్ఘకాలం టిడిపిలోనే పనిచేశారు.డీకే ఆదికేశవుల నాయుడుకు కర్ణాటకలోవిలువైన ఆస్తులు ఉండేవట. బెంగళూరు తో పాటు ఇతర ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉండేవని తెలుస్తోంది. మరోవైపు రఘునాథ్ కూడా బెంగళూరు పరిసర ప్రాంతాల్లో స్థితిమంతుడుగా ఉండేవారు. 2013లో ఆదికేశవులు మృతి చెందిన తర్వాత రఘునాథ్ ఆయనకు చెందిన అనేక ఆస్తులను తన ఆధీనంలోకి తీసుకున్నారు. వాటిని తమ పేర్ల మీద బదలాయించాలని.. తండ్రి ఆస్తులకు తాము వారసులమని అప్పట్లో శ్రీనివాస్, కల్పజ, మరికొందరు రఘునాథ్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 మే లో రఘునాథ్ అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితులుగా ఉన్న ఆది కేశవులు వారసులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తును నీరుగాచుతున్నారని మృతుడి బంధువులు ఆరోపించారు. ఈ కేసును సిబిఐ కి బదలాయించాలంటూ కర్ణాటక కోర్టుకు ఆశ్రయించారు. సిబిఐ రంగంలోకి దిగడంతో వీరి అరెస్టు జరిగింది. డీకే ఆదికేశవులు టిడిపి నుంచి ఎంపీ అయ్యారు. టీటీడీ చైర్మన్ గాను వ్యవహరించారు.

# వాజ్ పేయి విగ్రహంతో మొదలు

విజయవాడ, డిసెంబర్ 24,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విగ్రహాల రాజధానిగా రూపుదిద్దుకుంటోంది. అధికార కూటమిలోని పార్టీలు తమ నాయకులను గౌరవించుకుంటూ భారీ విగ్రహాలను ప్రతిష్టించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే అటల్, మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా



వాజ్‌పేయి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా, అమరావతిలోని వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో ఒక భారీ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనుంది. ఈ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 25న జరగనుందని, కేంద్ర మంత్రి అమిత్ షా హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఔఆంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ఆధ్వర్యంలోని ఏపీ ప్రభుత్వం.. రాష్ట్ర నూతన రాజధానిలో బీజేపీ దిగ్గజ దివంగత నేత అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం పెరుగుతుందని టీడీపీ భావిస్తోంది. అభివృద్ధి, సమన్వయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన పాలనకు ప్రతిరూపంగా వాజ్‌పేయిని భావిస్తూ.. అదే దిశలో అమరావతిని ముందుకు నడిపించాలన్న సందేశం ఇందులో ప్రతిఫలిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా వెంకటపాలెంలో ఏర్పాట్ల చేయబోయే వాజ్‌పేయి విగ్రహ ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ.ఎన్. మాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో అమరావతిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న తొలి విగ్రహం వాజ్‌పేయిదే కావడం గర్వకారణమని చెప్పారు. అందరికీ స్ఫూర్తి, ప్రేరణ కలిగించేలా వాజ్‌పేయి విగ్రహం ఉండబోతుందని మాధవ్ పేర్కొన్నారు.14 అడుగుల ఎత్తులో కాంస్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలోని ఇతర కార్యక్రమాల కారణంగా హాజరుకావడం లేదని చెప్పారు. అయితే ఢిల్లీ నుంచి పలువురు కేంద్ర నాయకులు ఆవిష్కరణ కార్యక్రమానికి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నట్లు మాధవ్ వెల్లడించారు. అమరావతిలో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు కేవలం ఒక విగ్రహ ఆవిష్కరణ మాత్రమే కాదని, భవిష్యత్ రాజధానికి ఒక ఆలోచనాత్మక ఆరంభమని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# సోషల్ మీడియా వారియర్స్ ఆర్తనాదాలు

విశాఖపట్టణం డిసెంబర్ 24,

వైసీపీ కార్యకర్తలు సాయం కోసం అల్లాడిపోతున్నారు. వైసీపీ కోసం విదేశాల్లోఉన్నా కెరీర్ ను నిర్లక్ష్యం చేసి మరీ పార్టీ కోసం పని చేస్తూ బ్రెయిన్ స్ట్రోక్ కు గురైతే కనీసం పార్టీ నుంచి పట్టించుకునేవారు లేకపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి వారు పెరిగిపోతున్నారు. కానీ పార్టీ నుంచి మాత్రం సాయం అందకపోవడంతో వారిని ఆందోళనకు గురి చేస్తోంది.చదువు కోసమో.. ఉద్యోగం కోసమో అమెరికాకు వెళ్లిన కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త.. అక్కడి నుంచి సోషల్ మీడియా వారియర్ గా పని చేస్తూంటారు. కూటమి నేతలను ట్రోల్ చేయడం, అసభ్యంగా పోస్టులుపెట్టడం వంటివి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు కామన్ కాబట్టి విదేశాల్లో ఉన్నా అవన్నీ చేస్తూంటాడు. అయితే హఠాత్తుగా అతను బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.డల్లాస్‌లో జరిగిన వైఎస్ జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణ రాజు కృష్ణారెడ్డికి వైద్య సాయం కోసం వెయ్యి డాలర్లు ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా సాయం చేశారు. కృష్ణారెడ్డి వైద్య ఖర్చుల భారం భారీగా ఉండటంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు 'ఉనీఈబీనిటఓవ' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. రెండున్నర లక్షల డాలర్లు సాయంకావాలని కోరుతున్నారు. కొంత మంది స్పందిస్తున్నారు. కానీ పార్టీ పరమైన సాయం ఇంకా ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పార్టీ కోసం పనిచేసిన కృష్ణారెడ్డికి సహాయం చేయాలని ఆయన కుటుంబసభ్యులు ఎన్ఆర్ఐ వైసీపీ శ్రేణులు, అభిమానులను కోరుతున్నారు.అమెరికాలోనే కాదు.. ఏపీలోనూ వైసీపీ కార్యకర్తలు ఇలాంటి కష్టాల్లో పడితే పట్టించుకునేవారు లేకుండా పోయింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు శ్యామ్ కలకడ అనే సోషల్ మీడియా వారియర్ ను అలాగే వదిలేయడంతో ఆయన చనిపోయారు. ఇప్పుడు విపక్షంలో ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి ఎవరికి వారు లోకేష్ సాయం కోరుతూ ట్వీట్లు పెట్టి కొంత మంది సాయం పొంది ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ వైసీపీ నుంచి మాత్రం ఎలాంటి మద్దతూ లభించడం లేదు. ఇది వారి క్యాడర్ ను బాధిస్తోంది.

# ఎడ్యూసిటీకి 1000 కోట్ల భూమి విరాళం

విజయనగరం, డిసెంబర్ 24,

విశాఖపట్నం - విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి ఇటీవలే ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ గ్రూప్ - మాన్సాస్ ట్రస్ట్ ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్టు తరుఫున రూ.1000 కోట్లు విలువైన 136.63 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు పూసపాటి వంశీయులు అంగీకరించారు. ఈ ప్రాజెక్టుకు తమ వంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పేట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరుతున్నారు.పూసపాటి వంశీయులు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. భావితరాల భవిష్యత్ కోసం సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. విశాఖపట్నం - విజయనగరం సరిహద్దుల్లోఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీనిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. జీఎంఆర్ గ్రూప్. మాన్సాస్ ట్రస్టు ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఇటీవలే మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్ - మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 160 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఏవియేషన్ ఎడ్యు సిటీ కోసం పూసపాటి వంశీయులు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు.ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టు కోసం 136.63 ఎకరాలు భూమిని అందించేందుకు మాన్సాస్ ట్రస్టు ముందుకు వచ్చింది. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద ఉన్న ఈ భూమిని ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు పూసపాటి వంశీయురాలు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జీఎంఆర్ - మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు పూసపాటి రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని అదితి గజపతిరాజు కోరారుమరోవైపు విజయనగరం జిల్లా భోగాపురం వద్దఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. 2026 మే లేదా ఆగస్ట్ నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు విమానయాన శాఖ చర్యలు చేపడుతోంది. అయితే విమానయాన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా.. భోగాపురం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటుచేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏవియేషన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయించాలని లక్ష్యంయా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమి లేదా ప్రభుత్వ భూములలో ఈ ఎడ్యు సిటీని ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయం తీసుకుంది.

===============

# పవన్ జాతీయ స్థాయిలో ముద్ర...

కాకినాడ డిసెంబర్ 24,

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో సైతం తన ముద్రను చాటుకుంటున్నారు. జాతీయస్థాయి రాజకీయాలను శాసిస్తున్న ఆయన ఇప్పుడు ఏపీలో నిర్వర్తిస్తున్న శాఖలను సైతం ముందంజలో తీసుకెళ్తున్నారు. ఏపీలో ఆయన నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయస్థాయిలో నంబర్ వన్ గా నిలిచింది. గతంలో జాతీయస్థాయిలో 23వ స్థానంలో ఉన్న ఏపీ 22 స్థానాలను మెరుగుపరుచుకొని ఒకటో స్థానంలో నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేషనల్ మీడియాలో సైతం ఇప్పుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.రాజకీయంగాను తనదైన మార్క్ చూపిస్తున్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి కట్టడంలో ఆయనదే కీలక పాత్ర. అప్పటివరకు బిజెపితో పాటు టిడిపి మధ్య గ్యాప్ ఉండేది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి దూరం చేయాలంటే మూడు పార్టీల కలయికను ముందే గుర్తు చేశారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే సంఘీభావం తెలిపి నేరుగా టిడిపితో పొత్తు ఉంటుందని సంచలన ప్రకటన చేశారు. బిజెపిని కూటమిలోకి తేవడంలోనూ.. తెలుగుదేశం పార్టీని ఎన్డీఏలో చేర్చడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. ఏపీలో మూడు పార్టీల కలయిక సూపర్ హిట్ గా నిలవగా.. జాతీయస్థాయిలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావడానికి కూడా ఒక విధంగా ఏపీ కారణం. ఇదంతా పవన్ కళ్యాణ్ కృషి ఫలితం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా దక్కింది.



అటు పవన్ కళ్యాణ్ సైతం తనకు గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలు కావాలని కోరారు. అందుకే పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి తో పాటు అటవీ శాఖను ఇచ్చారు చంద్రబాబు. దాదాపు 5 శాఖలు పవన్ కళ్యాణ్ వద్ద ఉన్నాయి. ఆ శాఖల విషయంలో పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులు గ్రామీణ శాఖలకు కేటాయిస్తూ.. అభివృద్ధికి బాటలు వేశారు పవన్ కళ్యాణ్. పల్లె పండుగ పేరుతో రికార్డు స్థాయిలో గత రెండేళ్లుగా అభివృద్ధి పనులు చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరాయి. అందుకే జాతీయస్థాయిలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ నెంబర్ వన్ గా నిలిచింది. ఈ క్రెడిట్ మాత్రం వన్ అండ్ ఓన్లీ పవన్ కళ్యాణ్.

# గొల్లపూడిలో శాటిలైట్ రైల్వేస్టేషన్...

విజయవాడ, డిసెంబర్ 24,

గొల్లపూడిలో కొత్త శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రిని కోరారు. దీనివల్ల విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గుతుందని, అమరావతి కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. అలాగే, కొండపల్లి రైల్వే స్టేషన్ వద్ద నీటి సమస్యను పరిష్కరించి, రైళ్ల రాకపోకలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై రైల్వే మంత్రి నిర్ణయం కీలకం కానుంది.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా శాటిలైట్ రైల్వే స్టేషన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గొల్లపూడి సమీపంలో శాటిలైట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.. వినతిపత్రం సమర్పించారు. గొల్లపూడిలో శాటిలైట్/హాల్ట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే విజయవాడ రైల్వేస్టేషన్ పై భారం తగ్గుతుందని ఎంపీలు వివరించారు. ఈ శాటిలైట్ స్టేషన్ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బల్బ్‌లైన్స్ చుట్టూ ఖాళీ స్థలాలున్నాయని, వాటిని రైల్వే అవసరాలకు సులభంగా సేకరించవచ్చని రైల్వేమంత్రికి వివరించారు. ఈ ప్రాంతం కొత్త రైలు, వాయుమార్గాలతో అనుసంధానం కానుందని.. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఈ ప్రాంతం విజయవాడ నగరానికి అన్ని సౌకర్యాలకు సెంటర్‌గా ఉంది కాబట్టి, గొల్లపూడిలో హాల్ట్/శాటిలైట్ స్టేషన్ నిర్మించాలన్నారు.అలాగే అంతేకాదు కొండపల్లి రైల్వేస్టేషన్ దగ్గర నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి కృష్ణా మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరకుండా నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఎంపీలు కోరారు. ఈ రెండు సమస్యల పరిష్కారం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుండి విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై మురుగునీరు, వర్షపునీరు నిలిచిపోవడం వల్ల రైళ్ల రాకపోకలకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారు వివరించారు.చిన్నపాటి వర్షం వచ్చినా ఇక్కడ నీరు నిలిచిపోతోందని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రమంత్రికి తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించడానికి, ట్రాక్ పక్కన డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు



నిర్మించి వర్షపునీరు సులభంగా వెళ్లిపోయేలా చూడాలని వారు కోరారు. ఇందుకోసం వెంటనే నిధులు కేటాయించి, పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రయాణికుల భద్రత కూడా మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మరి ఎంపీల ప్రతిపాదనలపై రైల్వే మంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.'కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్ వెంట మురుగునీరు, వర్షపు నీరు నిల్వ అవుతున్న సమస్యలను కూడా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి గారికి వివరించాను. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ వర్షపాతం సమయంలో కూడా శాస్త్రీయంగా రూపొందించిన డ్రైనేజ్ నెట్వర్క్, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు, కాలువలు అనుసంధానం లేకపోవడం వల్ల ట్రాక్ వెంట మురుగు నీరు నిల్వవుంటుందని తెలియజేశాను.. ఈ నీటి నిల్వల వల్ల స్థానిక నివాసితులు, పరిశ్రమలు ముఖ్యంగా కృష్ణ మిల్క్ యూనియన్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపాను. ఈ ప్రతిపాదనకు అమల్లోకి వస్తే విజయవాడ నగరంలో రైల్వే రవాణా మరింత సవ్యంగా మారడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, రైల్వే భద్రత, పరిశ్రమలు, స్థానిక ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశభావం వ్యక్తం చేశాను.. ఈ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించారు' అంటూ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

# బాలినేనికి కలిసి రాని కాలం

ఒంగోలు, డిసెంబర్ 24,

బాలినేని శ్రీనివాస్ రెడ్డి. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా.. సీనియర్ పొలిటీషియన్‌గా పేరున్న బాలినేని ఒంగోలులో మంచి పట్టున్న నేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. ఆ పార్టీలో అసంతృప్తిగానే కొనసాగారు బాలినేని.గత ఎన్నికల తర్వాత..జనసేన గూటికి చేరారు. వైసీపీలో మంత్రిగా పనిచేసినా..తనకు సరైన గుర్తింపు ఇవ్వలేదని..రెండున్నరేళ్లు మాత్రమే మంత్రి ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేస్తూ చాలాసార్లు అలకపాన్పు ఎక్కారు. ఎన్నికలకు ముందే జనసేనలో చేరాలని అనుకున్నా సమీకరణాలు సెట్ అవ్వకపోవడంతో వెయిట్ చేశారు.ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి అధికారంలోకి వచ్చాక పవన్ కళ్యాణ్ నేరుగా బాలినేనిని పార్టీలోకి తీసుకున్నారు. ఆయన కూడా ఉత్సాహంగా జనసేనలో చేరారు. బాలినేని జనసేనలో చేరి ఏడాది దాటినా ఇప్పటికీ పార్టీలో సెట్ అయిపోలేదట. పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు అటు వైసీపీ నేతలు అప్పుడప్పుడు ఆయనపై దుమ్మెత్తిపోస్తున్నారు.ఇటు కూటమి పార్టీల లీడర్లు కూడా.. బాలినేని వైసీపీ కోవర్ట్ అంటూ టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒంగోలు జిల్లాలో బాలినేనికి పరిస్థితులు అనుకూలంగా కనిపించడం లేదట. అక్కడున్న లోకల్ టీడీపీ లీడర్లు బాలినేనికి వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నారు. ఇక జనసేన మెల్లిగా బాలినేనిని ఓన్ చేసుకుంటున్నా అప్పుడప్పుడు కొన్ని సమస్యలు, ప్రోటోకాల్ ఇష్యూస్ వస్తున్నాయ్.ఇవన్నీ గమనించిన పవన్ కల్యాణ్ బాలినేనిపై సాఫ్ట్ కార్నర్ చూపిస్తున్నారట. బాలినేనికి రెండు వైపులా ఇబ్బందులు ఉన్నాయని పవన్ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. పైగా అన్నీ తట్టుకుని నిలబడుతున్నారంటూ బాలినేనిని అభినందించారు పవన్. దీంతో అధినేత మనసులో చోటు సంపాదించుకున్న బాలినేనికి త్వరలోనే ఏదో ఒక పదవి ఖాయమంటూ ప్రచారం జరుగుతోంది.బాలినేనిని పార్టీలోకి తీసుకున్నప్పుడే ఆయనకు ఎమ్మెల్సీ పోస్ట్ ఇవ్వాలనుకున్నారట పవన్. ఆ టైమ్‌లో ఈక్వేషన్స్



కుదరలేదంటున్నారు. నాగబాబును మండలికి పంపడంతో జనసేనకు అవకాశం లేకుండా పోయిందట. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్సీగా రాజీనామా చేసి జనసేనలో చేరిన జయమంగళ వెంకటరమణ స్థానాన్ని బాలినేనికి ఇవ్వాలని డిసైడ్ అయ్యారట.ఆ బెర్త్ విషయంలో కూడా చిక్కు వచ్చి పడింది. జయమంగళ వెంకటరమణ రాజీనామాను మండలి ఛైర్మన్ ఆమోదించకుండా చాలా కాలంగా పెండింగ్‌లో పెట్టారు. ఈ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలోకి వెళ్లింది. జయమంగళ రిసిగ్నేషన్ యాక్సెప్ట్ అయితే ఎమ్మెల్సీ స్థానం బాలినేనికి ఇవ్వడానికి రెడీగా ఉన్నారట పవన్.అయితే మండలి ఛైర్మన్ ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనని బాలినేని ఎదురుచూడక తప్పట్లేదు. దీంతో మొత్తానికి బాలినేనికి టైమ్ బాలేదన్న చర్చ జరుగుతోంది. అధికార పార్టీలో ఉన్నానన్న ఫీల్ లేకుండా పోయిందంటున్నారు. వైసీపీలో ఎలా అయితే ఇబ్బంది పడ్డారో జనసేనలో కూడా అంతకు మించి ఇబ్బందులు పడుతున్నారట బాలినేని. అయితే జనసేన అధినేత పవన్ సాఫ్ట్ కార్నర్‌తో ఉండటం బాలినేనికి కలిసొచ్చే అంశమంటున్నారు. బాలినేనికి కోరుకున్న పదవి దక్కేదెప్పుడో చూడాలి మరి.

# ఆ రెండు పార్టీలు కమలంపై కయ్యానికి దిగుతాయా

హైదరాబాద్, డిసెంబర్ 24,

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ , వైసీపీ అధినేత జగన్ ఇటీవల కొన్ని ప్రత్యేకమైన సిగ్నల్స్ పంపుతున్నారు. తాము బీజేపీకి వ్యతిరేకంగా భారీ యుద్ధం చేసేందుకు రెడీ అన్నట్లుగా వారు సంకేతాలు ఇస్తున్నారు. జగన్ ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలపై అవినీతి ఆరోపణలు చేస్తూండటం, కేసీఆర్ నేరుగా ప్రెస్‌మీట్‌లో మోడీ వచ్చాకే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందన్నట్లుగా మాట్లడుతూండటంతో ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. వీరిద్దరూ ఇతర కూటముల్లోకి వెళ్లలేరు. కానీ కలసి రాజకీయాలు చేస్తే బలంగా ఉంటామని మాత్రం నమ్ముతున్నారు.దేశ రాజకీయాలంతా ఓ వైపు సాగుతూంటే.. బీఆర్ఎస్, వైసీపై మాత్రం మరో వైపు సాగుతూంటాయి.వారు కాంగ్రెస్ కూటమిలోకి వెళ్లలేరు. బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. కాంగ్రెస్ కూటమిలోకి వెళ్తే ఎక్కడ టార్గెట్ అవుతామో.. ఎక్కడ కేసుల పాలవుతామోనన్న భయం ఉంటుంది. అదే సమయంలో వీర బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. ఇద్దరికీ ఓటు బ్యాంక్ సమస్య ఉంటుంది. జగన్ బీజేపీతో పొత్తులు పెట్టుకుంటే ఆయన పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. కేసీఆర్ ఇప్పుడు చాలా ఓటు బ్యాంక్ ఆ పార్టీకి కోల్పోయారు కాబట్టి.. పొత్తులు పెట్టుకోవడానికి రెడీనే .కానీ బీజేపీనే ఆసక్తి చూపించడం లేదు. పార్టీని విలీనం చేయడానికి కూడా సిద్ధపడ్డారని సీఎంరమేష్ చెప్పారు. సాధ్యం కాలేదు. అందుకే తాము ఓ కూటమిగా ఉండాలని కేసీఆర్, జగన్ అనుకుంటున్నారు.జగన్ పుట్టినరోజు సందర్భంగా సజ్జల..జగన్మోహన్ రెడ్డి దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతారని జోస్యం చెప్పారు. అందరి లక్ష్యం అదే. కేసీఆర్ కూడా అలాంటి లక్ష్యం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు.కానీ కలసి రావడం లేదు. గత ఎన్నికల్లో ఏపీ,తెలంగాణ, మహారాష్ట్ర ఇలా కొన్ని రాష్ట్రాలను టార్గెట్ చేసి రాజకీయాలు చేస్తే జీరో ఫలితం వచ్చింది. అటు జగన్ పరిస్థితి అంతే. అంతే వచ్చే ఎన్నికల్లో అయినా ఆ చక్రం తమ చేతికి వస్తుందని అనుకుంటున్నారు. వైసీప బలం తనకు అదనపు బలం అవుతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. జగన్ అలా అనుకోకపోయినా.. ఇప్పటికైతే కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు.వచ్చే ఆరు నెలల్లో తమ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుని బీజేపీపై వీరు యుద్ధం ప్రకటించబోతున్నారని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోందని రాజకీయ వర్గాలంటున్నాయి. కానీ ఇప్పుడు మాట్లాడే మాటలన్నీ కేవలం బీజేపీకి తామున్నామని గుర్తు చేయడానికేనని కొంత మంది అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ హైకమాండ్ వీరి ఉనికిని పెద్దగా గుర్తించడం లేదు. వీరు కనుక.., బీజేపీపై యుద్ధం ప్రకటిస్తే.. రాజకీయాల్లో కాస్త మార్పు వస్తుంది. కానీ వీరు ఆ ధైర్యం చేస్తారా..? ఆరంభ శూరత్వమా అన్నది త్వరలో తెలుస్తుంది.

# తెలంగాణకు పెద్ద ఎత్తున పులులు

అదిలాబాద్, డిసెంబర్ 24,

నీరు ఎత్తు నుంచి పల్లం ప్రాంతానికి ప్రవహిస్తుంది. అది సృష్టి నియమం కూడా. కేవలం నీరు మాత్రమే కాదు.. జంతువులకు కూడా ఇది వర్తిస్తుంది. కాకపోతే ఎత్తు, పల్లం నిబంధనలు ఇక్కడ వర్తించవు. కేవలం ఆహారం, గూడు, నీరు అనేవి మాత్రమే జంతువుల వలసకు వర్తిస్తాయి. జంతువులలో మిగతా వాటితో పోల్చి చూస్తే.. పులులు కాస్త విభిన్న తత్వాన్ని ప్రదర్శిస్తుంటాయి. ఆహారం, ఆవాసం, తోడు, సురక్షితం ఇలా అన్ని విషయాలలోనూ పకడ్బందీ లెక్కలతో ఉంటాయితెలంగాణకు సరిహద్దున మహారాష్ట్ర ఉంటుంది. మహారాష్ట్రలో దట్టమైన అడవులు ఉన్నాయి. అయినప్పటికీ అక్కడి పులుల కొన్ని ప్రస్తుతం తెలంగాణకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలలో సంచరిస్తున్నట్టు తెలుస్తోంది.సరిగ్గా కొద్ది రోజుల క్రితం టిప్పరేశ్వర్ అభయారణ్యం, తడోబా రిజర్వ్ నుంచి కొన్ని పులులు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అందులో కొన్ని పులులు దక్షిణ మార్గంలో ఉన్న ప్రాంతాలలోకి వెళ్లిపోయాయని తెలుస్తోంది. అయితే కొన్ని పులులు ఈ మార్గాల గుండా ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి అనుకూలమైన వాతావరణము లేదు. ఎందుకంటే ఈ ప్రాంతాలలో గతంలో దట్టమైన అడవులు ఉండేవి. అక్రమార్కులు ఈ అడవిని చదును చేయడం వల్ల పులులు ఆ మార్గాల గుండా వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో మల్యాలపల్లి సమీపంలో పులి ఉన్నట్టు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.. " ఇక్కడ పెద్దగా అటవీ ప్రాంతం లేదు. కానీ కొన్ని కొండల వద్ద ఒక మేకల కాపరి పులి కాలి ముద్రలను చూసినట్టు మాకు చెప్పాడు. మేము పులిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని" డిప్యూటీ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ కొమరయ్యా పేర్కొన్నారు.ఈ పులి గతంలో రామగుండం సమీపంలోని సింగరేణి ప్రాంతాలలో కనిపించింది. పులి కనిపించినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ జిల్లా పరిధిలోని 12 మండలాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కొమురయ్య సూచించారు. కామారెడ్డి జిల్లాలో గత వారం కల్పించిన ఒక పులి ఇప్పటికీ ఆ ప్రాంతంలో కనిపిస్తూనే ఉంది. అది అనేక పశువులను వెంబడించింది. కొన్ని పశు వులను చంపి తినేసింది. పులి తిన్న తర్వాత మిగిలిన కళేబరాలను చూసి అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పులి నిరంతరం సంచరిస్తున్న నేపథ్యంలో



పశువులను చంపి తినే అవకాశం ఉండవచ్చని అడవి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు దోమ కుంట, బిబి పెంట, బిక్నూరు మండలాలలో పులి కదలికలు కనిపించాయి.కొత్తగా వచ్చిన పులుల వల్ల.. ఈ ప్రాంతంలో ఉన్న మిగతా పులులు కూడా బయటకు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం లో ఒక పులి ఉన్నట్టు అటల్ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ పులి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నుంచి మల్లేశ్వరం, వేమకల్, యంగంపల్లి ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అధికారులు భావించారు. " ఈ పులి ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి కృష్ణ నదికి అవతలి వైపు నుంచి వచ్చింది. గత ఏడాది కూడా ఒక పులి నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి తిరిగి వచ్చింది" అని కొల్లాపూర్ అటవీశాఖ అధికారి ముజీబ్ గౌరీ వెల్లడించారు. " అప్పటినుంచి అది కనిపించలేదు. దాని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం. మా రేంజ్ ఆఫీసర్ హుస్సేన్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర నాయకత్వంలో పులి సంచారం గురించి పరిశీలిస్తున్నాం. ఇక్కడ కెమెరా ట్రాప్ లు అందుబాటులో ఉంచాం. నదిని దాటి నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ లోకి తిరిగి వెళ్లే బదులు అది అమ్రాబాద్ టైగర్ రిజర్వుల్లోకి వెళ్లి ఉండవచ్చని" గౌరీ ప్రకటించారు. పులి సంచారం ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో సమీప ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో ఆహారం సరిగా లభించకపోవడం, ఆడపులుల సంఖ్య తక్కువగా ఉండడంతో పులులు ఇటువైపు వస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

# ఏడాదిలో కండోమ్స్ కోసం లక్ష రూపాయిలు... వాడు మగాడురా బుజ్జీ

ముంబై, డిసెంబర్ 24,

మరికొద్ది రోజుల్లో 2025 కాలగర్భంలో కలిసిపోనుంది.. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కామర్స్ అనేది ప్రస్తుతం మన జీవితంతో అవినాభావ సంబంధాన్ని ఏర్పరచుకున్న నేపథ్యంలో.. ఈ కామర్స్ సంస్థలు తమ లావాదేవీలను వెల్లడిస్తుంటాయి. తమకు ఎదురైన అనుభవాలను పంచుకుంటాయి. మనదేశంలో ఈ కామర్స్ సంస్థలలో దిగ్గజ కంపెనీ ఇన్ స్టా మార్ట్ ఈ ఏడాదికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది.ఆ సంస్థ వెల్లడించిన ఈ ఏడాది వార్షిక నివేదిక ప్రకారం.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి అత్యంత కనిష్టంగా ఖర్చు పెట్టాడు. అతడు కేవలం పది రూపాయల ఆర్డర్ మాత్రమే ఇచ్చాడు. పది రూపాయల విలువైన ప్రింట్ అవుట్ కావాలని అతడు ఆర్డర్ పెట్టాడు. వాటిని మాత్రమే అతడు తెప్పించుకున్నాడు. ఈ ఏడాది ఇన్స్టా మార్ట్ లో అత్యంత కనిష్టమైన లావా దేవి ఇదేనని ఆ సంస్థ పేర్కొంది.. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి లేటెస్ట్ ఐఫోన్ కోసం ఏకంగా 4.3 లక్షలు ఖర్చు పెట్టాడు.. ఇది అత్యంత ఖరీదైన లావాదేవీ అని ఇన్స్టా మార్ట్ ప్రకటించింది. కేవలం అతడు ఫోన్ల కోసమే భారీగా ఖర్చు పెట్టాడని ఇన్స్టా వెల్లడించింది. మరోవైపు ఓ వ్యక్తి ఏడాదిలో 22 లక్షల ను వివిధ ఉత్పత్తుల కొనుగోలుకు ఖర్చు పెట్టాడు. ముంబై నగరానికి చెందిన ఓ వ్యక్తి దాదాపు 15.16 లక్షల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశాడు. చెన్నై నగరానికి చెందిన ఓ వ్యక్తి క×డో×మ్ ల కోసం ఏకంగా లక్ష రూపాయలు ఖర్చు పెట్టాడు.ఇన్ స్టా మార్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో టైర్ 2 నగరాలలో రాజ్ కోట్ వేగవంతమైన అభివృద్ధిని నమోదు చేస్తోంది. ఇప్పటికే ఈ నగరం 10రెట్ల వృద్ధిని నమోదు చేసింది. లుధియానా ఏడు, భువనేశ్వర్ నాలుగు రెట్ల వృద్ధిని శ్రద్ధ చేసుకుంది.. ప్రజలు ఎక్కువగా ఆర్డర్ చేసిన వాటిల్లో కరివేపాకు మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పెరుగు, గుడ్లు, పాలు, పండ్ల వంటివి ఉన్నాయి.. కేరళ రాష్ట్రంలోని కొచ్చి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 368 సార్లు కరివేపాకు కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ప్రకారం చూసుకుంటే రోజుకు సగటున ఒకసారి అతడు ఆర్డర్ పెట్టినట్టు అర్థమవుతుంది. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తరచూ ఇన్ స్టా మార్ట్ లో కొనుగోలు జరిపాడు. అదే కాదు తనకు వస్తువులను డెలివరీ చేయడానికి వచ్చిన వ్యక్తికి ఏకంగా 68,600 టిప్ గా చెల్లించాడు. ఇక మిగతా తినుబండారాలు కూడా భారీగానే విక్రయమయ్యాయని ఇన్ స్టా మార్ట్ వెల్లడించింది. ఉదయం 7:00 నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 4గంటల నుంచి ఏడు గంటల వరకు తమకు ఆర్డర్లు ఎక్కువగా వచ్చినట్టు ప్రకటించింది.

# సర్‌తో అంతా సరౌతుందా...

హైదరాబాద్, డిసెంబర్ 24,

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఈసీ.వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. ఒక్కొక్కరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని.. అర్హులైన వాటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులను కానీ.. ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని.. చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు.. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు.ఇప్పటికే ఎన్ డి ఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టెంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

# బీఆర్ఎస్ సోషల్ మీడియా ఫుల్లీ లోడెడ్

హైదరాబాద్, డిసెంబర్ 24

నేటి కాలంలో రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా ఉండాల్సిందే. నిజమో లేదా అబద్ధమో గట్టిగా చెప్పగలగాలి. ప్రస్తుతం ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది కాబట్టి.. రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా అనేది ఒక కనీస అనివార్యతగా మారిపోయింది. అధికారంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను మరింత పద్ధతిగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.. ఏతా వాతా సోషల్ మీడియా అనేది ప్రస్తుత కాలంలో రాజకీయ పార్టీలకు కనీస అవసరం.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. దశాబ్ద కాలం రాష్ట్రంలో అధికారానికి దూరమైన తర్వాత కాంగ్రెస్ పార్టీ 2023లో గద్దెనెక్కింది.. ఇలాంటి క్రమంలో ప్రభుత్వ పథకాలను.. ప్రభుత్వం చేస్తున్న పనులను.. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలంగా చెప్పగలగాలి. అవసరమైతే విస్తృతమైన నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ప్రజల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి.. కానీ ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోయినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాదిరిగానే ఇప్పుడు కూడా సోషల్ మీడియా ను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తుంది.ఇటీవల కెసిఆర్ బయటికి వచ్చారు. రేవంత్ ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా మొన్నటి నుంచి అన్ని విభాగాలలో అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు మొదలుపెట్టింది. అంతేకాదు కేసీఆర్ మాత్రమే తెలంగాణకు రక్షకుడు అన్నట్టుగా ప్రచారం ప్రారంభించింది.. కెసిఆర్ చెప్పిన ప్రతి మాటను నిజమని నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ విషయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియా విజయవంతమైనది కూడా. వాస్తవానికి ఇలాంటి సమయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియాకు బలమైన కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ కు కర్త ఎవరు? కర్మ ఎవరు? క్రియ ఎవరు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. పైగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి కీలక స్థాయిలో పనిచేసిన వారంతా సరైన గుర్తింపు లేకపోవడంతో బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఎవరో కొందరిని రిక్రూట్ చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా ఆశించిన స్థాయిలో బలాన్ని ఇవ్వలేకపోతోంది.కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ ఎంత బలహీనంగా ఉందో ఏబీఎన్ లో పనిచేసే కీలక న్యూస్ ప్రజెంట్ వెంకటకృష్ణ చేసిన వ్యాఖ్యలే బలమైన నిదర్శనం. సోమవారం నాటి ఏబీఎన్ ప్రైమ్ టైం బులిటెన్ లో వెంకటకృష్ణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గులాబీ పార్టీ సోషల్ మీడియా విపరీతంగా ప్రచారం చేస్తుంటే.. కనీసం కౌంటర్ కాదు కదా.. ఏమీ ఇవ్వకుండా ముసుగు తన్ని పడుకున్నారని వెంకటకృష్ణ ఆరోపించారు. దీనిని బట్టి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఎలా మార్పు చెందాలి? ఎలా బలోపేతం అవ్వాలి? అనే విషయాల మీద ఆ పార్టీ పెద్దలు దృష్టి పెడితే మంచిది. లేకపోతే అంతే సంగతులు. ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా ముందు అధికార పార్టీ సోషల్ మీడియా సైలెంట్ అయిపోతే అంతకుమించిన దరిద్రం మరొకటి ఉండదు.

# నాగోబా జాతర షురూ...

అదిలాబాద్, డిసెంబర్ 24,




మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా మహా పూజలకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని 2026 జనవరి 18న కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహించనున్న సందర్భంగా సోమవారం రాత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం వంశీయులు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని నాగోబా మురాడి దేవస్థానంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెస్రం వంశీయుల పటేల్ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సాంప్రదాయం ప్రకారం నెలవంకను దర్శించుకునీ, నాగోబాకు పూజలు నిర్వహించారు.ఆదివాసీలకు పవిత్ర మాసం ఈ పుష్యమాసం.. కాళ్లకు చెప్పులు ధరించకుండ, మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ నెలరోజుల పాటు అత్యంత పవిత్రంగా పుష్యమాసంలో అడవి బిడ్డలు తమ ఆరాధ్య దైవాలను కోలుస్తుంటారు. ఒక్కో గోత్రానికి ఒక్కో రకమైన ఆచారాలు సాంప్రదాయాలు వారి దైవాలు ఉంటాయి. అయితే ఈ మెస్రం వంశీయులకు నాగోబా కుల దైవం. మెస్రం వంశీయులలోనూ ఛయ్ గొట్టే మెస్రం వంశీయులు పడియోర్ అని పిలుస్తుంటారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం సూర్య చంద్రులను దైవాలుగా కోలుస్తారు. అందులో ఒక భాగమే నేలవంక దర్శనం. మాసాలను గుర్తించే దిశగా ఈ నెలవంక సూచిస్తుంది. పుష్యమాసం ప్రారంభంతో నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో తమ దైవాలను కోలుస్తుంటారు.మెస్రం వంశీయులు ప్రతియేటా నాగోబాను పుష్యమాసంలో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ దర్శించుకుంటారు. వచ్చే 2026 జనవరి18న నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ చేయనున్నారు. మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. అయితే నాగోబాకు అభిషేకం కోసం కావలసిన పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర గురించి 7 గ్రామాల్లో, 7 రోజుల పాటు ప్రచారం నిర్వహించే (ఛకడ) ఎడ్లబండి నాగోబా ప్రచార రథయాత్రను నేడు మంగళవారం ప్రారంభించనున్నారు. నేడు మరోసారి అందరూ మెస్రం వంశీయులు సమావేశమై ఈ నాగోబా ప్రచార రథయాత్ర గురించి రూట్ మ్యాప్ ను తయారు చేసి నాగోబాకు పూజలు చేసి ఛకడ వాహనం ఎడ్లబండిపై నాగోబా ప్రచార రథయాత్ర ప్రయాణం చేయనున్నారు.

7 రోజులపాటు 7 గ్రామాలలో జాతర

7 రోజుల పాటు ఆయా గ్రామాల గుండా ఈ రథయాత్ర కొనసాగుతుంది. ఏడు గ్రామాలలో ఏడు రోజులపాటు నాగోబా జాతర ప్రారంభం గురించి మహాపూజకు కావాల్సిన కుండలు ఇతర వాటి సేకరణ గురించి కార్యాచరణ మొదలుపెడతారు. అనంతరం ఏడు రోజుల తర్వాత తిరిగి కేస్లాపూర్ కు చేరుకొని, నాగోబా అభిషేకం మహాపూజ కోసం కావలసిన పవిత్ర గంగాజలం కోసం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరినదిలో గల హస్తలమడుగు వద్దకు పాదయాత్రగా బయలుదేరనున్నారు

# ఫోన్ ట్యాపింగ్ లో చిక్కులు తప్పవా



హైదరాబాద్, డిసెంబర్ 24,

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తన దూకుడును పెంచడంతో, ఈ వ్యవహారం ఇప్పుడు నేరుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల ముంగిటకు చేరినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ కేసుగానే కాకుండా, రాజకీయ భూకంపంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల కీలక నిందితుడు, మాజీ నిఘా విభాగం చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాలు ఇప్పుడు గులాబీ బాస్ చుట్టూ ఉచ్చు బిగించేలా ఉన్నాయి.అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే విపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీలోని అసంతృప్త నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా విదేశాల నుంచి విచారణకు సహకరిస్తున్నట్లు చెబుతున్న ప్రభాకర్ రావు, అప్పటి ప్రభుత్వంలోని అగ్రనేతల సూచనల మేరకే ఈ వ్యవస్థ నడిచినట్లు కీలక సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల మళ్లింపును పర్యవేక్షించడానికి, ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడానికి ఈ ట్యాపింగ్ పరికరాలను వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారబోతోందని తెలిసిన వెంటనే ఇంటెలిజెన్స్ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడం ఈ కేసులో అతిపెద్ద నేరంగా పరిగణించబడుతోంది.అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే రాజకీయంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభాకర్ రావుతో పాటు ఇతర నిందితుల స్టేట్‌మెంట్లలో వీరి పేర్లు ప్రస్తావనకు రావడంతో, అసలు ఈ నిర్ణయాల వెనుక ఎవరున్నారు? దీనికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయి? అనే కోణంలో ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. “చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే” అని ఆయన వ్యాఖ్యానించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలని, బాధితులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంలా కాకుండా, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తోంది.ఈ కేసు కేవలం నోటీసులతో ఆగిపోతుందా లేదా అరెస్టుల వరకు వెళ్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును లాజికల్ ఎండ్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉంది. ఇది రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక ఆధారాలు బలంగా ఉంటే తప్పించుకోవడం కష్టమే. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌ల నుండి రికవరీ చేసిన డేటా, నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ ఈ కేసులో కీలకం కానున్నాయి.తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత గోప్యతను హరించడం క్షమించరాని నేరం. ఒకవేళ సిట్ సేకరించిన ఆధారాలు కోర్టులో నిలబడితే, బీఆర్ఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు. వచ్చే కొన్ని వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి.

# న్యూ ఇయర్ జోష్ లో తప్పులు చేస్తే...

హైదరాబాద్, డిసెంబర్ 24,

కొత్త సంవత్సరానికి ఓ మంచి వాతావరణంలో స్వాగతం పలకండి, గలీజు పనుల జోలికి వెళ్లొద్దు, సెలబ్రేషన్స్‌ని ఇల్లీగల్‌గా చేసుకొని కేసుల బారిన పడొద్దు అని కూల్‌కూల్‌గా మెసేజ్ ఇస్తున్నారు ఖాకీలు. కాదూకూడదూ అని రెచ్చిపోతే, కథ కటకటాల్లోకే అని గట్టి వార్నింగూ వినిపిస్తోంది.మరో వారం రోజుల్లో న్యూఇయర్ జోష్ షురూ. అంబరాన్నంటే సంబరాలే కాదు, ఓవరాక్షన్లు, ఆవారా పనులూ కూడా అప్పుడే. వెర్రెక్కిన కుర్రకారుకు అడ్డూ అదుపూ ఉండదు. పోలీసులకు ఏడాదంతా ఒక ఎత్తయితే, కొత్త సంవత్సర సీజన్ ఒక్కటీ ఒక ఎత్తు. ఎందుకంటే, సెలబ్రేషన్స్ పేరుమీద అక్కడ జరిగే అరాచకాలకు అంతే ఉండదు. అందుకే, ఎక్సైజ్, డ్రగ్ కంట్రోల్, లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్.. అన్ని శాఖలూ ఒక్కటయ్యాయి. ఈగల్ టీములు కూడా ఎటెన్షన్‌లోకొచ్చేశాయి. ఉఊఓఅతోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్‌కి సిద్ధమైంది ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్.హైదరాబాద్‌లోని పబ్బులు, ఫామ్ హౌస్‌లపై డేగ కన్నేశారు ఖాకీలు. డ్రగ్స్ అమ్మేవాళ్లతోపాటు వినియోగించేవాళ్లు కూడా దొరికితే లోపలేయడం పక్కా. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీల్లో కనిపించకూడదు. ఇంతేకాదు, పరిమితికి మించి లిక్కర్ వాడినా నేరమే. అటు, నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ మీద కూడా ఫోకస్ పెట్టింది ఖాకీ శాఖ.గంజాయి విక్రయాల్లో స్టూడెంట్స్ కూడా ఉండడంతో కాలేజ్ యాజమాన్యాలు, హాస్టళ్ల ఓనర్స్‌తో మీటింగ్స్ పెట్టి క్లాసులు పీకారు పోలీసులు. ఇటు, ఏపీ, ఒడిషా, మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్నారన్న వార్తలతో అప్రమత్తమయ్యారు పోలీసులు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి వాహనాలను ఎక్కడిక్కడే తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఈగల్ టీమ్స్, ఎస్ఓటీ పోలీసులు కంబైన్డ్ ఆపరేషన్స్ స్పీడప్ చేశారు. నిన్నటికి నిన్న హైదరాబాద్ రాయదుర్గంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, 12 గ్రాముల ఓఆఓం, 7 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. పబ్‌లపై కూడా నిఘా పెంచేశారు. రూల్స్ ఉల్లంఘించిన పబ్‌లపై కేసులు నమోదయ్యాయి.ఇటీవలే ఆపరేషన్ దూల్‌పేట్ పేరుతో జూలు విదిల్చి, వంద కేసులు నమోదు చేసింది. వరుస తనిఖీలతో డ్రగ్స్ ట్రాఫిక్ నియంత్రణలోకొచ్చి, గంజాయి అమ్మకాలు 90 శాతం తగ్గినట్టు లెక్కుంది. అయినా సరే, న్యూ ఇయర్ వేడుకలను తేలిగ్గా తీసుకోవడం లేదు పోలీసులు.

========================

# కాళేశ్వరం పై ఆశలు

హైద్రాబాద్, డిసెంబర్ 24,

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు నీళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. గత ఆదివారం మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చ కు దారి తీస్తూనే ఉన్నాయి. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మర్చిపోక ముందే.. ఆయన కుమారుడు రంగంలోకి వచ్చారు. ఈసారి ఏకంగా ఆయన కాళేశ్వరం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంగళవారం సిరిసిల్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన పరిపాలన మాఫియా మాదిరిగా ఉందని మండిపడ్డారు.. కెసిఆర్ పరిపాలన కాలంలో చేసిన మంచి పనులకు అనేక రకాలుగా రేవంత్ ప్రభుత్వం వక్ర భాష్యం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇందుకోసం రేవంత్ ప్రభుత్వం చేయని పని లేదంటూ మండిపడ్డారు.2023 ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆ పథకం పై బాంబులు వేయడం వల్లే దెబ్బ తిన్నదని అనుమానించారు.. ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ డ్యాం ల మీద బాంబులు వేశారని మండిపడ్డారు. మానవ నిర్మిత అద్భుతమైన కట్టడాల మీద మానవ విధ్వంసం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పేరుపొందిన రాజేంద్ర సింగ్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలిస్తున్న తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. “ఇసుకను తరలించడానికి ప్రాజెక్టులకు రంధ్రాలు చేస్తున్నారు. అందులో బాంబులు పెట్టి పేల్చుతున్నారు. ఇసుకను దోచుకోవడానికి ప్రాజెక్టులు అడ్డుగా ఉన్నాయని భావించి.. కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో నిర్మించిన చెక్ డ్యాములను పడగొడుతున్నారు. భూగర్భ జలాల పెంపుదల కోసం మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెక్ డ్యాములను నిర్మించాం. ఇసుక కోసం వాటిని కూల్చివేసి.. పొలాలను ఎడారులుగా మారుస్తున్నారు. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి ఎంత మాత్రం మంచిది కాదు.

# 27న నూతన సర్పంచ్ లకు ఆత్మీయ సమ్మేళనం కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి



కరీంనగర్, డిసెంబర్ 24(భారతశక్తి ప్రతినిధి):

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27న కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో 27న ఉదయం 11 గంటలకు జరిగే ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లు హాజరు అవుతారని చెప్పారు. అలాగే కరీంనగర్ పార్లమెంటరీ స్థాయి, శాసనమండలి, శాసనసభ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు హాజరవుతారని తెలియజేశారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల, అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపు ఇచ్చారు.

# మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవల గురించి ఒక రోజు శిక్షణా కార్యక్రమం

కడప, డిసెంబర్ 24(భారత శక్తి):

బాలలకు ఉన్న చట్టాలపై మరియు మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవల గురించి ఒక రోజు శిక్షణా కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని మహిళా పోలీసులకు డి ఆర్ సి సి హాలు, డి బ్లాక్, న్యూ కలెక్టరేట్, కడప యందు నిర్వహించబడమైనది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి. పి. రమాదేవి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి, వై.యస్.ఆర్. కడప మహిళా పోలీసులు, పిల్లలు మరియు మహిళల రక్షణలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపారు. కావున మహిళా పోలీసులందరూ ప్రతి ఒక్కరు వారి సచివాలయ పరిధిలోని మహిళలు మరియు పిల్లలతో అనునిత్యం మమేకమై మాట్లాడుతూ వారికి ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని నివృత్తి చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.

మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ నందు ఐ.సి.డి.యస్. ద్వారా అందిస్తున్న సేవలు, మిషన్ వాత్సల్య ద్వారా అందిస్తున్న సేవలు, మిషన్ శక్తి మరియు గృహ హింస విభాగము ద్వారా అందిస్తున్న సేవలు గురించి వివరంగా వివరించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో శ్రీమతి. శోభారాణి, డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ వారు మహిళా పోలీసులు చైల్డ్ మ్యారేజ్ ఆపడంలో వారి యొక్క పాత్ర గురించి వివరించడం జరిగినది.




శ్రీమతి. శాంత, ఏ.సి.హెచ్.టు మహిళా పోలీసులకు విధి నిర్వహణలో పాటించవలసిన మెలుకవలు మరియు పిల్లల పట్ల వ్యవహరించ వలసిన శైలి గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు శిశు గృహ సిబ్బంది పిల్లలకు ఉన్న రక్షణ చట్టాల గురించి మరియు మిషన్ వాత్సల్య గురించి వివరించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో జిల్లా యందలి పట్టణ పరిధిలోని మహిళా పోలీసులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు శిశుగృహ మరియు మిషన్ శక్తి సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# లక్ష్మీనరసింహ వైన్స్ తక్షణమే అక్కడి నుంచి తొలగించాలి:

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్



చిట్యాల, డిసెంబర్ 24(భారత శక్తి): గత కొద్ది నెలల నుంచి చిట్యాల మండల కేంద్రంలోని విద్యా కేంద్రాలను ఆనుకొని ఉన్న లక్ష్మీ నరసింహ వైన్ని అతను తొలగించాలని వినిత్వరూపాలలో కార్యక్రమాలు చేస్తున్న కూడా అధికారుల నుంచి స్పందన లేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్ అన్నారు. ఈ వైన్స్ వలన విద్యార్థులు చెడిపోయే ప్రమాదం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం పక్క గంజాయి డ్రగ్స్ నివారణ చర్యలు చేస్తూ కార్యక్రమాలు చేపడుతుంటే అధికారులు మాత్రం మద్యాన్ని ప్రోత్సహించే విధంగా, పర్యవేక్షణ చేయకుండా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దీనివలన విద్యార్థులకు మద్యం తాగే విధంగా ప్రోత్సహించే పరిస్థితులు ఉన్నట్లుగా ప్రజలకు కనబడుతుందని, విద్యార్థులు, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకోసమే వీసీకే, డివైఎఫ్ఐ సంఘాలుగా పోరాటాలు నిర్వహిస్తున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు సూపరింటెండెంట్ కు తక్షణమే లక్ష్మి నరసింహ వహించి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. లేనిపక్షంలో రెండు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులకు కృష్ణలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు



కడప, డిసెంబర్ 24(భారత శక్తి):ఏసు క్రీస్తు జననం విశ్వ శాంతి కి మూలం..ఆయన ప్రబోధనలు ప్రేమ, ఐక్యతకు ప్రతీకలు.. ఆయన జీవిత చరిత్ర సమాజానికి మార్గదర్శకం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు అని, మన ఆచార వ్యవహారాలు మన విలువలను రెట్టింపు చేస్తామన్నారు. ప్రపంచంలో మనుషులంతా సుఖశాంతులతో సోదర భావంతో మెలగాలనే గొప్ప శాంతి సందేశమిచ్చిన దైవదూత జన్మించిన పర్వదినం క్రిస్మస్. అన్ని మతాల సారాంశం ఒక్కటే. ప్రపంచంలో మానవాళి అంతా సుఖశాంతులతో జీవింపజేయడమే. అందుకు మూలం శాంతి, ప్రేమ, దయ గుణాలు. వాటికి ఎవరు ఎన్ని బాష్యాలు చెప్పినా వాటి పరమార్థం మాత్రం ఒక్కటే. సాటి మనుషులనే కాక అన్ని ప్రాణుల పట్ల కరుణ, దయ, మానవత్వం కలిగి ఉండాలని ఉద్బోధించిన క్రీస్తు సూక్తులు అందరికీ ఆదర్శం. తనను బాదించినవాడిని కూడా ప్రేమించమని చెప్పిన ఆయన సందేశం లోకానికి మేలుకొలుపు.ప్రభుత్వ సుపరిపాలన, బాధ్యత, నిబద్ధత, సంక్షేమ పథకాల ఫలాలతో.. జిల్లా ప్రజల జీవితాల్లో ప్రతిరోజు పర్వదినంగా సంతోషాల సౌరభాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ క్రిస్మస్ పండుగ సందర్భంగా.. అందరికీ ప్రభువు ఆశీస్సులు, దీవెనలు అందాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పల్లె ప్రగతికి నూతన పాలకవర్గాలు కృషి చేయాలి

తెలంగాణ పల్లె పాలనలో కొత్త పాలక మండళ్లు ప్రమాణ స్వీకారం చేశాయి. ప్రజాస్వామ్యబద్ధమైన నూతన పాలక వర్గాలు( గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు మెంబర్లు) కొలువు తీరాయి. 2 ఏళ్ల తర్వాత గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం వచ్చింది. గ్రామ రాజకీయాలలో కొత్త అధ్యాయం మైదలైంది. ప్రజలు ఎన్నుకున్న స్థానిక పాలకులు అధికారంలోకి వచ్చారు.

పల్లెలో పాలన బాధ్యతలు స్వీకరించిన పాలకులు

మహాత్మా గాంధీ భావించిన గ్రామ స్వరాజ్య సాధన సహకారం కావాలంటే గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డ్ సభ్యులు గ్రామాన్ని స్వయం సమృద్ధి దిశగా అభివృద్ధి చేయాలి. గ్రామాల అభివృద్ధిపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. గ్రామాన్ని అన్ని రంగాల్లో స్వయం స్వవృద్ధి దిశగా తీర్చిద్దిదాలి.గ్రామఆర్థికపోషకత్వానికి పెద్దపీట వేయాలి. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నూతన సర్పంచులు వార్డు సభ్యులు పై ఉంది.

గ్రామ పాలనలో పారదర్శనికత పాటించాలి

గ్రామపాలనలో పారదర్శనికతను పాటించాలి. గ్రామనిధులు ఖర్చులు ప్రజలందరికీ తెలిసేలా నోటీసు

బోర్డుపై ప్రకటించాలి.


గ్రామపంచాయతీ పేరున

వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలి

గ్రామపంచాయతీ పేరున వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి వార్డు సభ్యులకు గ్రామంలోని కుల సంఘాల బాధ్యులకు తల్లుల కమిటీ సభ్యులకు అంగన్వాడీ కేంద్రాలకు నీటి సంఘాల బాధ్యులకు వివిధ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు తెలిసే విధంగా వాట్సాప్ గ్రూప్ ను నిర్వహించాలి. వాడవాడలా ఉన్న సమస్యలను గ్రామ సర్పంచ్ కు పాలకవర్గానికి గ్రామ కార్యదర్శికి తెలిసే విధంగా నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

వనరుల వినియోగం బిఆర్థిక స్వయం సమృద్ధి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ గ్రామాభివృద్ధి పథకాల కు వస్తున్న నిధుల యొక్క లెక్కలు పథకాలలో పథకాలకు అర్హులైనటువంటి ప్రతి ఒకరికి ఫలితం చెందే విధంగా చూడాలి గ్రామీణ స్వయం సమృద్ధి కొరకు పాటుపడాలి గ్రామాల్లో లభించే వనరులను ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలి .సంపదను ఉత్పత్తి కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి .పంచాయతీలు స్థానిక వనరులను వినియోగించి ఆదాయాన్ని పెంచుకోవాలి .



వ్యవసాయం అనుబంధ రంగాల అభివృద్ధి

గ్రామంలో నీటి సంఘాలు రైతు సంఘాల ద్వారా నేలల తీరును బట్టి పంటలు పండించే విధానాలపై ఆధునిక సేద్య పద్ధతులపై సేంద్రియ వ్యవసాయ విధానాలపై వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సభలు సమావేశాలు అవగాహన శిబిరాలు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉత్పాదకతను పెంచి రైతాంగ ఆర్థిక సంక్షేమానికి దోహదపడే పలు ప్రాజెక్టులను నిర్వహించడం. కోళ్ల పెంపకం పశుగణాభివృద్ధి గొర్రెల పెంపకం కోళ్ల పెంపకం పాల ఉత్పత్తి మల్బరీ తోటల పెంపకం ఉద్యానవనాల పెంపకం పూల తోటలు పండ్ల తోటల పెంచడంలో రైతులకు ఆధునిక శిక్షణ సౌకర్యాలను కల్పించడం ద్వారా గ్రామ ప్రజల ఆదాయాలను ఉపాధిని సృష్టించే ఉత్పత్తి ఉత్పాదక ఆర్థిక కార్యక్రమాలను పెంచే పథకాల అమలుకు కృషి చేయాలి

భూసార పరిరక్షణ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం

ఉపాధి హామీ పథకాల అమలు

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మున్నగునవి

ప్రోత్సహించడం గ్రామీణ వికాసం కోసం అభివృద్ధి పథకాలను సూక్ష్మ స్థాయి ప్రణాళికల రూపకల్పన చేయాలి.

గ్రామీణ కుటీర పరిశ్రమల ప్రోత్సాహం

స్థానిక కుటీర పరిశ్రమల స్థాపన చేతివృత్తుల ఆదరణ వాటి ఉత్పత్తులను ప్రోత్సహించడం మార్కెటింగ్ సౌకర్యాలు కల్పన ద్వారా ఆర్థిక పరిపోషకత్వానికి స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా ప్రోత్సహించాలి.

గ్రామంలో మౌలిక సదుపాయాల ఏర్పాటు

గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలి. రక్షిత మంచినీటి పథకాన్ని ప్రతి ఇంటికి చేర్చాలి .పారిశుధ్యం గ్రామంలో 100% బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా ఉంచాలి. వీధి దీపాల కోసం విద్యుచ్ఛక్తి పై ఆధారపడకుండా సోలార్ విద్యుత్ శక్తిని సమకూర్చుకోవాలి.

విద్య ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేయాల. ప్రజలకు ఇమ్యూనిటి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంచాలి. ప్రతి నెలకు ఒక సారి ఆరోగ్య నిపుణుల ద్వారా ఫ్రీ మెడికల్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.ఆరోగ్య వసతులను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

నూతనంగా ఎన్నికైన సర్పంచులు వార్డ్ మెంబర్లు గ్రామంలో పర్యావరణ రక్షణకు పాటుపడాలి.

పర్యావరణ రక్షణ కొరకుమొక్కలు నాటడం. నర్సరీల పెంపకం హరితహారం చెరువుల పునరుద్ధరణ ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలాలపెంచడం .

సామాజిక ఐక్యత కు పాటుపడాలి,

గ్రామసభను క్రమం తప్పకుండా నిర్వహించడం నూతన సర్పంచి వార్డ్ మెంబర్లు సామాజిక బాధ్యతా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పథకాలనురూపొందించాలి.

గ్రామ ఐక్యతకు అభివృద్ధికి పాటుపడాలి

కొత్తగా కొలువు తీరిన గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డ్ సభ్యులు కుల మత రాజకీయాల కతీతంగా గ్రామ ఐక్యత కొరకు పాటుపడాలి. సర్పంచ్ గ్రామ అభివృద్ధికి ఒక విజనరీగా వ్యవహరించాలి. అప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది.

×గ్రామీణ స్వచ్ఛతబి ప్రజల భాగస్వామ్యం×

గ్రామీణ స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. తడి పొడి చెత్తకు ప్రత్యేక ఏర్పాటు చేయాలి. చెత్తను రోడ్డుపై వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి .గ్రామంలో ఉన్న ప్రజలు పన్నులు చెల్లించే విధంగా వారిలో సామాజిక బాధ్యతను మోటివేట్ చేయాలి. ఇంటి పన్ను నీటి పన్ను సకాలములో చెల్లించిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

ఆదాయం పెంచుకునే అంశాలను నిర్లక్ష్యం చేయరాదు. వచ్చిన ఆదాయంతో మౌలికసౌకర్యాలను విస్తరించాలి .

సామాజిక ఆస్తులను రక్షించాలి

గ్రామంలోని సామాజిక ఆస్తులు రక్షించాలి .అడవులు గుట్టలు చెరువులు బడులు పార్కులు

మున్నగు వాటిని రక్షించాలి.

”నా గ్రామం నా బాధ్యత అనేది నినాదం “కాకుండా విధానం కావాలి

నా గ్రామం నా బాధ్యత అనేది నినాదం కాకుండా ప్రజల జీవన విధానంగా రూపకల్పన చేయాలి.

గ్రామం నాది అనే మానసిక భావన పౌరులందరిలో కలగాలి.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రజలు శ్రమదానంతో గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుకు రావాలి.

కమిటీలలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలి

విద్యా కమిటీ ఆరోగ్య కమిటీలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలి. నా గ్రామం నా బాధ్యత అనేది నిదానంగా కాకుండా పౌర విధానంగా కొనసాగాలి. అభివృద్ధి కాంక్ష ప్రజల్లో కల్పించినప్పుడే గ్రామీణ స్వరాజ్యం సిద్ధిస్తుంది. అప్పుడే గ్రామీణ అభివృద్ధి జరుగుతుంది. కాబట్టి అంకితభావంతో అభివృద్ధి దిశగా కొత్త సర్పంచులు నూతన విధానాలతో గ్రామీణ అభివృద్ధిలో నూతన ఉరవడితో పాలనను ప్రారంభిస్తారని ఆశిద్దాం.

పల్లెల్లో పేరుకుపోయిన సమస్యలు పారిశుధ్యం తాగునీటి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచి రాబోయే వేసవి కాలం నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి తక్షణమే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంలో విజయం సాధిస్తాయని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య

అధ్యక్షులు

తెలంగాణ ఎకనామిక్ ఫోరం

తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం హైదరాబాద్9440245771

# విజయవంతంగా ముగిసిన సాంస్కృతిక ఉత్సవం

## - గీతంలో ఆర్ట్ స్కేప్-25 పేరిట మూడు రోజుల వేడుకలు

## - ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 24 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో నృత్యం, సంగీతం, దృశ్య కళలను వేడుకగా జరుపుకునే మూడు రోజుల సాంస్కృతిక ఉత్సవం 'ఆర్ట్ స్కేప్-25'ను విజయవంతంగా నిర్వహించారు. జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, లలిత, ప్రదర్శన కళల విభాగాధిపతి డాక్టర్ లలిత సింధూరిల సమక్షంలో ఈ ఉత్సవాన్ని గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రారంభించారు.మొదటి రోజు విద్వాన్ డి.శ్రీనివాస్ 'డివైన్ స్ట్రింగ్స్' పేరిట నిర్వహించిన వీణా కచేరీ మంత్రముగ్ధులను చేసి, శుభారంభాన్ని అందించింది. ముత్తుస్వామి దీక్షితార్ స్వరపరిచిన



'మహాగణపతిం' కీర్తనతో ప్రారంభమై, ఒక శుభప్రదమైన, ఉత్తేజకరమైన వాతావరణాన్ని నెలకొల్పింది. దీని తరువాత త్యాగరాజ ప్రసిద్ధ కీర్తనలైన 'బ్రోవభారమా', 'నగుమోము'లను ఆలపించారు. ఇవి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కచేరీకి వయోలిన్ పై దినకర్, మృదంగంపై రామకృష్ణ, ఘటంపై చంద్రకాంత్ సహకారం అందించి, ఈ ప్రదర్శనకు మరింత వన్నె తెచ్చారు.

రెండవ రోజు, విద్వాన్ ఆనందు మురళి కర్ణాటక గాత్ర కచేరీతో ప్రారంభమైంది. ఆయన గంభీర నటరాగంలో డాక్టర్ ఎం.బాలమురళీకృష్ణ స్వరపరిచిన పదవవర్ణంతో కచేరీని ప్రారంభించారు. వివిధ వాగ్గేయకారుల కూర్పులను ప్రదర్శిస్తూ, ఆయన శైలీపరమైన బహుముఖ ప్రజ్ఞను, సంగీత గాంభీర్యాన్ని ప్రదర్శించారు. సదాబహార్ 'హరివరాసనం'తో ముగిసి, శాశ్వత ముద్ర వేసింది. మృదంగంపై విద్వాన్ టి.పి.బాలసుబ్రహ్మణ్యన్, వయోలిన్ పై విద్వాన్ కౌండిన్య ఆయనకు సహకరించారు.దీని తరువాత, విద్వాన్ అంజు అరవింద్ అందించిన మనోహరమైన భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఆమె ప్రధాన అంశంగా 'నవరసమోహన'ను, ఆ తరువాత 'శ్రీరామచంద్ర కృపాలు' భజనను ప్రదర్శించారు. ఆమె భావప్రకటనతో కూడిన అభినయం, లయబద్ధమైన నైపుణ్యం ఎంతగానో ప్రశంసలందుకున్నాయి. ఈ ప్రదర్శన పూర్వి రాగంలో తిల్లనాతో ముగిసి, ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకుంది. చివరి రోజు, దర్భా సోదరీమణులు-విద్వాన్ హరిణి, విద్వాన్ మృదురవళి అందించిన హృద్యమైన నేపథ్య గాత్ర ప్రదర్శనతో ప్రారంభమైంది. వారి ప్రదర్శన స్పష్టత, సౌందర్యాత్మక ఆకర్షణతో విభిన్న సంగీత ప్రక్రియలను ఆవిష్కరించింది. వారితో పాటు తబలాపై విద్వత్ సాయి కిరణ్, వేణువు-కీబోర్డుపై విద్వత్ సాయి రాఘవ సహకారం అందించారు.

విద్వత్ పి.బి.వైష్ణవి ఉత్సాహభరితమైన కూచిపూడి కచేరీతో ఆర్ట్ స్కేప్-25 ముగిసింది. ఆమె తిరుప్పావైని ప్రార్థనా రచనగా ప్రారంభించి, తరంగం ప్రధాన అంశంగా వ్యక్తీకరణతో కథ చెప్పడం ప్రేక్షకులను ఆకర్షించింది.కళాత్మక నైపుణ్యం, ఉత్సాహభరితమైన వేడుకగా ఆర్ట్ స్కేప్-25 నిలిచింది. విద్యార్థులలో సాంస్కృతిక వారసత్వం, సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించడంలో గీతం యొక్క నిబద్ధతను చాటిచెప్పింది.

# అల్ఫోర్స్ లో ఘనంగా ముందస్తు క్రిస్మస్ సంబరాలు

కరీంనగర్, డిసెంబర్ 24(భారతశక్తి ప్రతినిధి):

ఏసుక్రీస్తు బోధనలు విలువైనవని, స్ఫూర్తిదాయకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ ప్రేమ, ఆప్యాయతకు నిర్వచనమని, సంతోషానికి ప్రతీకనీ గుర్తుచేసి ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి ఏసుక్రీస్తు చిత్రపటానికి జ్యోతిని వెలిగించి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. బంధుమిత్రులతో ఈ పండుగను సైతం చాలా రెట్టింపు ఉత్సాహంతో జరపకోవడమే పండగలో మాధుర్యాన్ని ఇతరులకు తెలియజేస్తారని చెప్పారు.

ఏసుక్రీస్తు బోధించినటువంటి ప్రేమ, ఆప్యాయత, ఐక్యత, విధేయత, అనురాగం గుణాలన్నింటిని పెంపొందించుకోవాలని, మానవత్వంతో మెదిలి మానవజాతికి అండగా ఉండాలని అదేవిధంగా సమాజంలో చోటు చేసుకునేటువంటి అభివృద్ధి ప్రక్రియకు చేయూతనివ్వాలని చెప్పారు. ఏసుక్రీస్తు యొక్క బోధనలు ప్రపంచవ్యాప్తంగా అమలు చేయడం జరుగుతుందని చూపెట్టినటువంటి మార్గదర్శకాలను నేటికీ చక్కగా అమలుపరచడం వలన ఫలితాలు పొందుతున్నారని చెప్పారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రదేశించినటువంటి ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం చాలా ఆలోచింపచేసింది. రంగనాన్ని క్రిస్మస్




టీలతో శాంతా క్లాస్ ఆకనాలతో చక్కగా అలంకరించి పండుగ వార్త మరణాన్ని రెట్టింపు చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోండి

## జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్, డిసెంబర్ 24 (భారతశక్తి ప్రతినిధి):

ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ , జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలాకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ సి.ఎస్.ఐ ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నగర ప్రతినిధులను కలుపుకొని సంబంధిత అధికారులు కార్యక్రమాన్ని సమన్వయం చేసే ప్రయత్నం చేసారనీ చెప్పారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఫోటోను పూర్తిగా విస్మరించారనీ అన్నారు. మొదటిసారి కాదని ఇటీవల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో (7వ వార్డు) నియోజకవర్గం అయినప్పటికీ అధికారిక ఫోటోలు, సమాచారంలో పొందుపరచలేదనీ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులకు తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వడం అత్యంత అవసరం అని, భవిష్యత్తులో



ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని, దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి అనిల్, జీడి రమేష్, సముద్రాల లక్ష్మణ్, జుంజుపల్లి వివేక్, గొట్టే బాబు, కనకం విద్యాసాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ పదవి కాదు...మీ ఊరి బాధ్యత...

## ప్రభుత్వ మెడలు వంచి గ్రామాలకు నిధులొచ్చేదాకా పోరాడతాం

### పార్టీ గుర్తుతో ఎన్నికలైతే కాంగ్రెస్ పార్టీకి ఒక్కసీటు రాదు

### సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆత్మీయ సన్మానంలో కేంద్ర మంత్రి బండి సంజయ్


కరీంనగర్, డిసెంబర్24(భారతశక్తి ప్రతినిధి):

రాబో?యే నెల రోజుల్లో రాష్ట్రంలోని పంచాయతీలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి హైదరాబాద్ లో పరేడ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. నిధుల మంజూరు తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ సాకుతో నిధుల విడుదలలో జాప్యం చేస్తే ప్రభుత్వ మెడలు వంచేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అల్టిమేటం జారీచేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సర్పంచులను గెలిపించిన గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీఇచ్చారు. బుధవారం నగరంలోని రేకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరై వారిని ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్పంచ్ గిరి చేయాలంటే ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారం తప్పనిసరి. ఈ ముగ్గురు కలిసి ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమారుతుందన్నారు.

మీ గెలుపు కోసం కుటుంబ సభ్యులతోపాటు కార్యకర్తలు, సీనియర్ నాయకులు అంతా కలిసి క్రుషి చేశారు. వీళ్లందరి క్రుషివల్లే 108 మంది సర్పంచులను బీజేపీ మద్దతు గెలిచారని గుర్తుచేశారు.

**సర్పంచ్ పదవి కాదు..బాధ్యత**

సర్పంచ్, ఉప సర్పంచ్ అంటే పదవి కాదు. ప్రజలు మీకిచ్చిన బాధ్యత మాత్రమేనని గుర్తుంచుకోవాలి. ప్రజలకు ఆపదొస్తే, కష్టమొస్తే ఆదుకునే తండ్రి బాధ్యత సర్పంచ్ లదే. డాక్టర్లు, అధికారులతో సత్సంబంధాలు పెంచుకోవాలి. మీ గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుండాలి. చిరునవ్వుతో పలకరించడమే కాకుండా నడక, నడతలో మంచి తనం ఉండాలి. బీజేపీ గ్రామ సర్పంచ్ అంటే? ఇతర గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా తీసుకునేలా వ్యవహరించాలి. బాసిజం చేయాలని చూస్తే ప్రజల్లో వ్యతిరేకత మొదలైనట్లేనని గుర్తుంచుకోవాలనీ సూచించారు.



**అడ్డగోలు హామీలిస్తే**

గ్రామాల్లో అడ్డగోలు హామీలిస్తే ఇబ్బందుల్లో పడతారనీ, గ్రామాల్లో మొదట చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి. గత రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నయాపైసా ఇయ్యలే. రాబోయే కాలంలో నిధులిస్తుందనే నమ్మకం కూడా లేదు. అంతో ఇంతో నిధులిచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేది కేంద్రమేనన్నారు. పార్టీ గుర్తుతో ఎన్నికల్లోకి వెళితే కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం తెలిసే పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గెలిచిన వాళ్లంతా కాంగ్రెసోళ్లేనని గంప కింద కమ్మేస్తోందనీ విమర్శించారు.

**బీజేపీ సర్పంచ్ లు ఆదర్శంగా నిలవాలి**

బీజేపీ సర్పంచులున్న 108 గ్రామాల అభివృద్ధికి నా మొదటి ప్రాధాన్యత. ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఆయా గ్రామాలను తీర్చిదిద్దుతా. ఎంపీ లాడ్స్ తోపాటు సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తా. ప్రతి గ్రామంలో ఒక వాటర్ ప్లాంట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నా. ప్రతి స్కూల్ లో టాయిలెట్లను నిర్మిస్తాం. ప్రతి గ్రామంలో విద్య, వైద్యం నా తొలి ప్రాధాన్యత. అతి త్వరలో 9వ తరగతి చదివే విద్యార్థులకు సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేయిస్తా. ప్రైవేట్ ఆసుపత్రుల్లో లేని పరికరాలను కూడా కరీంనగర్, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసిన. ఇకపై బీజేపీ సర్పంచ్ లు గెలిచిన గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కోసం అవసరమైన మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందిస్తానాని హామీఇచ్చారు.

**ప్రభుత్వానికి అల్టిమేటం జారీ**

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా. మేం మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందించేందుకు సిద్ధంగా ఉన్నా. అయితే తగిన సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ప్రభుత్వానికి డెడ్ లైన్ ఇస్తున్నా. రాబోయే నెల రోజుల్లో గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి. ఎలక్షన్ కోడ్ రాక ముందే నిధులు రిలీజ్ చేయాలి. ఆ తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోకి వెళ్లాలని డిమాండ్ చేస్తున్నా. ఎన్నికల సాకుతో తప్పి?ంచుకోవాలనుకుంటే మాత్రం బీజేపీ పక్షాన తగిన గుణపాఠం చెబుతాం. కాంగ్రెస్ సర్కార్ ను నిద్రపోనివ్వం. ప్రభుత్వ మెడలు వంచి పంచాయతీలకు నిధులిచ్చేదాకా పోరాడతాం. గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర నిధులను డైవర్ట్ చేసి పంచాయతీలను సర్వనాశనం చేసింది. ఆ పరిస్థితి రాకూడదు, కేంద్ర నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులిచ్చేదాకా పోరాడతాం. ఈ విషయంలో బీజేపీతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచులు కూడా కలిసి రావాలని కోరుతున్నా. సర్కార్ మెడలు వంచి నిధులు తీసుకొచ్చే బాధ్యతను రామచంద్రరావు నాయకత్వంలో బీజేపీ తీసుకుంటుందన్నారు.

**ఓడిపోయిన వాళ్లకు విజ్ఞప్తి**

గెలిచిన వాళ్లే కాదు.. పార్టీ కోసం పోటీ చేసి ఓడిపోయిన నాయకులకు అభినందనలు చెబుతున్నా. పార్టీ బలపర్చిన అభ్యర్థులంతా గెలిపించుకునేందుకు పార్లమెంట్ కు వెళ్లకుండా అమిత్ షా నుండి అనుమతి తీసుకుని కరీంనగర్ లో మకాం వేసి ఏం చేశానో మీకు తెలుసు. కొంత మంది కార్యకర్తలు పోటీ చేయాలంటే నామినేషన్ వేయడానికి కూడా పైసల్లేని పరిస్థితి. అయినా 500 పంచాయతీల్లో పోటీ చేసి బీజేపీ ఉనికి చాటారు. ఓడినపప్పటికీ వాళ్ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో అభివృద్ధి నిధులు వెచ్చిస్తానని మాట ఇచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ బీజేపీ ఇంచార్జి మనోహర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.



# సినిమా

## 'దండోరా' సెన్సార్ రిపోర్ట్..
# 15 మార్పులు సూచించిన బోర్డు

శివాజీ, నవదీప్, బిందు మాధవి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. 2.16 గంటల నిడివితో 'దండోరా' ప్రేక్షకుల ముందుకురానుంది. దీనికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన సెన్సార్ బోర్డు చిత్ర బృందానికి 15 మార్పులు సూచించింది. ఇందులో వాడిన కొన్ని అసభ్య పదాలను కచ్చితంగా తొలగించాలని ఆదేశించింది. అలాగే సినిమా ప్రారంభంలో వాయిస్ ఓవర్‌తో ఇందులోని పాత్రలు కల్పితమని పేర్కొంటూ గమనిక ఇవ్వాలని సూచించింది. కొన్ని సన్నివేశాలను బ్లర్ చేయాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో తాజాగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మలయాళంలో ఎక్కువ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలొస్తుంటాయి. అలా మన దగ్గర ఎందుకు రావనే ఆలోచనల్లో నుంచి ఈ కథ రాసుకున్నట్లు తెలిపారు. ''అందరూ టీజర్, పాటలు చూసి దీన్ని 'బలగం'తో పోలుస్తున్నారు. నిజానికి దానికి, దీనికి ఏ పోలిక లేదు. వ్యక్తి చనిపోయిన తర్వాత నుంచి ఆ శవాన్ని ఖననం చేసేవరకు ఈ కథ ఉంటుంది. ఆ శవాన్ని పూడ్చనీయకుండా ఓ ఊరి వాళ్లు ఎందుకు అడ్డుకున్నారు? అసలు ఆ ఊరి సమస్య ఏంటి? దానికి పరిష్కారం దొరికిందా? లేదా? అనే అంశాలతో దీన్ని రూపొందించాం'' అని చెప్పారు.

# నాని 'ది ప్యారడైజ్'లో హీరోయిన్ ఫిక్స్!



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు హీరో నాని. ఆయన ప్రధాన పాత్రలో శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో నాని సరసన కయాదు లోహర్ నటించనున్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ కయాదు ఓ వీడియో షేర్ చేశారు. తన ఇన్‌స్టాలో 'ది ప్యారడైజ్' గ్లింప్స్‌ను షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీలను జోడించారు. దీంతో నాని సరసన ఈ భామ ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కూడా కయాదు జాయిన్ అయినట్లు తెలుస్తోంది. ఆమెపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారని సమాచారం. త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న చిత్రమిది. తిరుగుబాటు, నాయకత్వంతో పాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది. ఇందులో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. మోహన్‌బాబు విలన్‌గా శికంజ మాలిక్' పాత్రలో నటిస్తున్నారు. ఇక 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో కయాదు లోహర్ తెలుగు ప్రేక్షకులనూ అలరించారు. ప్రస్తుతం ఈమె విశ్వక్‌సేన్ సరసన 'ఫంకీ' లోను నటిస్తున్నారు.

# ఓటీటీలోకి బాహుబలి: ది ఎపిక్

దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన అద్భుత మూవీ బాహుబలి. రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చూపింది. ఆ తర్వాత రెండు భాగాలు కలిపి పదేళ్ల తర్వాత బాహుబలి: ది ఎపిక్ పేరుతో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 31న బాహుబలి: ది ఎపిక్ విడుదలైన విష యం తెలిసిందే. రెండు భాగాల్లో సుమారు 90 నిమిషాలకు పైగా సన్నివేశాలను తొలగించి థియేటర్లలో విడుదల చేశారు. ఇక రీరిలీజ్లోనూ ఈ మూవీ రికార్డులు తిరగరాసింది. రీరిలీజ్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. మొదటి రోజు దేశ వ్యాప్తంగా రూ.9.25 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం రూ.18 కోట్లు కలెక్ట్ చేసినట్లు సమాచారం. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి రానుంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిసెంబర్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రీ రిలీజ్‌లో తొలగించిన సన్నివేశాలు ఇప్పుడు ఓటీటీలో యాడ్‌చేస్తారేమో అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.




# పూజ ఫలితమివ్వలేదు

సినీ నటి ప్రగతి పవర్ లిఫ్టింగ్‌లో 4 పతకాలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. టర్కీ వేదికగా జరిగిన షియన్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొని ఒక బంగారు పతకంతో పాటు మూడు రజత పతకాలు దక్కించుకుంది. దీంతో చాలా మంది వేణు స్వామితో చేయించుకున్న పూజల వల్లే ఆమెకు పతకాలు దక్కాయని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఇదే తరుణంలో వేణు స్వామి చేసిన పూజల తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. వీటిపై ప్రగతి స్పందించింది. 'వేణు స్వామి పూజల వల్లే నాకు ఈ విజయం సాధ్యమైంది అని అంతా అనుకుంటున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. సుమారు రెండున్నరేళ్ల ముందు నేను చాలా లోగా ఉండేదాన్ని. అప్పుడు నా ఫ్రెండ్స్ రెఫర్ చేయడంతో నేను వేణుస్వామి వద్దకు వెళ్లాను. ఈ విషయం ఆయనకు చెప్పడంతో స్వామి ఏదో పూజ చేశారు. కానీ నాకు పెద్దగా ఫలితమేమీ కనిపించలేదు. ఈ పూజల వల్ల మంచి ఫలితాలు వచ్చాయని మాత్రం నాకేమీ అనిపించడం లేదు. కానీ ఏడాది క్రితం జరిగిన పూజల ఫొటోలను మళ్లీ ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ వైరల్ చేస్తున్నారు. వాటి గురించి నేను ఏం మాట్లాడగలను? ప్రగతి మెడల్స్ సాధించడానికి నేనే కారణమని అంటూ వేణుస్వామి చేస్తున్న కామెంట్లను ఆయన సంస్కారానికే వదిలేస్తున్నా.'' అంటోంది ప్రగతి.






# శివాజీ పాలిష్డ్‌గా చెప్పలేదు

నటుడు శివాజీ హీరోయిన్ల వస్త్రధారణపై చేసిన కామెంట్లపై హాట్ హాట్ గా చర్చ జరుగుతోంది. ఏకంగా ఆయనకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ తరుణంలో నటి కరాటే కల్యాణి ఆయనకు అండగా నిలిచింది. శివాజీ.. అన్నగా, తండ్రిగా ఆలోచించి మంచి ఉద్దేశంతోనే ఆ మాటలన్నారని ఆమె సమర్థించారు. సినిమా ఫంక్షన్లకు అర్ధనగ్నంగా రావడం వల్ల సమాజంలో సంస్కృతి దెబ్బతింటుందని, పిల్లలు వాటిని చూసి పాడయ్యే అవకాశం ఉందని కల్యాణి ఆందోళన వ్యక్తం చేశారు. శివాజీ పాలిష్డ్ గా చెప్పలేకపోయి ఉండొచ్చు కానీ, ఆయన చెప్పిన పాయింట్‌లో నిజం ఉందన్నారు. ముఖ్యంగా నటి అనసూయ, సింగర్ చిన్మయిల స్పందనపై కల్యాణి ఘాటుగా స్పందించారు. "నా శరీరం నా ఇష్టం" అనడం సరికాదని, పబ్లిక్ ఫంక్షన్లకు వచ్చేటప్పుడు పద్ధతిగా ఉండాలని హితవు పలికారు. "అనసూయ గారు.. మీకు ఇద్దరు కొడుకులు ఉన్నారు కదా, రేపు వారు అసభ్యంగా దుస్తులు ధరించే అమ్మాయిలతో తిరిగితే మీకు ఇష్టమేనా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. కేవలం పాపులారిటీ కోసమే కొందరు ఈ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు.



# అలా ఏడ్చిన వారంతా ఇప్పుడు మౌనంగా ఉన్నారు: ధురంధర్ దర్శకుడి పోస్ట్




ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది 'ధురంధర్'. ఎంతోమంది ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమాపై మొదటి వారంలో కొందరు విమర్శలు చేశారు. తాజాగా దర్శకుడు ఆదిత్యధర్ వాటిపై స్పందించారు. ఈ సినిమాకు వస్తున్నవన్నీ కార్పొరేట్ బుకింగ్స్ మాత్రమేనంటూ కొందరు పెట్టిన పోస్ట్‌లపై ఆదిత్య తన ఇన్‌స్టా వేదికగా ఇప్పుడు సమాధానమిచ్చారు. విడుదలైన మొదటి రోజు నుంచే భారీ కలెక్షన్లను సొంతం చేసుకున్న 'ధురంధర్' ఇప్పటికీ ఆ జోరు కొనసాగుతోంది. బాలీవుడ్‌లో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో ముందు వరుసలో నిలిచింది. దీనికి సంబంధించిన పోస్ట్‌ను షేర్ చేసిన దర్శకుడు విమర్శకులకు కౌంటర్ ఇచ్చారు. ''ధురంధర్ సాధించిన అత్యుత్తమ విజయం ఏంటంటే.. ఈ సినిమాకు వచ్చిన ప్రతి టికెట్ ఆర్గానిక్‌గా కొన్నదే. విడుదలైన సమయంలో కార్పొరేట్ బుకింగ్స్ (బాక్సాఫీసు నంబర్ల కోసం ఉద్దేశపూర్వకంగా పెద్ద ఎత్తున టికెట్ల బుకింగ్స్ చేయడం) అని ఏడ్చిన వారంతా ఇప్పుడు అకస్మాత్తుగా మౌనం వహిస్తున్నారు. భారతీయ సినీ రంగంలో ఈ సినిమా చిరస్థాయిగా నిలిచిపోతుంది. దేశంపై ఉన్న ప్రేమకు 'ధురంధర్' నిదర్శనం'' అని పేర్కొన్నారు. మరోవైపు 'ధురంధర్2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న సీక్వెల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతేకాదు, హిందీతో పాటు, దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం పార్ట్2 పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉందని తెలిపారు. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మూడో వారం కూడా హౌస్‌ఫుల్ కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.900 కోట్లకు (గ్రాస్) పైగా వసూళ్లు చేసినట్లు సినీ వర్గాల సమాచారం. ఈ వారంలోనే రూ.1000కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.






విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బెంగళూరు వేదికగా ఢిల్లీ, ఆంధ్ర జట్లు తలపడ్డాయి. ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ 83 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ జట్టు 37.4 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 300 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్ల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. విరాట్ కోహ్లీ (131; 101 బంతుల్లో, 14 ఫోర్లు, 3 సిక్సలు) భారీ శతకం సాధించాడు. నితీశ్ రాణా (77; 55 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలు), ప్రియాంశ్ ఆర్య (74; 44 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సలు) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అర్పిత్ రాణా (0), రిషభ్‌పంత్ (5), ఆయుష్ బదోని (1) నిరాశపరిచారు. హర్ష్ త్యాగి (4*), నవదీప్ సైనీ (5*) నాటౌట్‌గా నిలిచారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు, హేమంత్ రెడ్డి చెరో రెండు, నితీశ్ కుమార్ రెడ్డి, కె.ఎస్.నరసింహ రాజు తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు ఆంధ్ర బ్యాటర్లలో రికీ భుయ్ సెంచరీతో (122; 105 బంతుల్లో, 11 ఫోర్లు, 7 సిక్సలు) ఆకట్టుకున్నాడు. షేక్ రషీద్ (31), నితీశ్ కుమార్ రెడ్డి (23), హేమంత్ రెడ్డి (27), సింగుపురం ప్రసాద్ (28) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో సిమర్జీత్ సింగ్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. ముంబయి, సిక్కిం మధ్య జైపూర్ వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో రోహిత్ శర్మ సెంచరీతో అలరించాడు.

## రోహిత్ శర్మ భారీ సెంచరీ.. ముంబయి ఘన విజయం



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా ముంబయి, సిక్కిం తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబయి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ముంబయి 30.3 ఓవర్లలోనే 2 వికెట్లు నష్టపోయి 237 పరుగులు చేసింది. రోహిత్ శర్మ 62 బంతుల్లో సెంచరీ చేశాడు. చివరకు 155 (94 బంతుల్లో, 18 ఫోర్లు, 9 సిక్సలు) పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో వన్డేల్లో రోహిత్ శర్మకు అత్యంత వేగవంతమైన సెంచరీ. అంతకు ముందు 2023లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో బంగ్లాదేశ్ మీద 63 బంతుల్లో శతకం బాదాడు. అంగ్క్రిష్ రఘువంశీ (38; 58 బంతుల్లో, 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ముషీర్ ఖాన్ (27*), సర్ఫరాజ్ ఖాన్ (8*) నాటౌట్‌గా నిలిచారు. సిక్కిం బౌలర్లలో అంకుర్ మాలిక్, క్రాంతి కుమార్ చెరో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు సిక్కిం బ్యాటర్లలో అశిష్ (79; 87 బంతుల్లో, 8 ఫోర్లు) రాణించాడు. కె.సాయి సాత్విక్ (34), క్రాంతి కుమార్ (34), రాబిన్ లింబో (31*) ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముంబయి బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 2, తుషార్ దేశ్‌పాండే, తనుష్ కోటియాన్, షామ్స్ ములానీ, ముషీర్ ఖాన్ తలో వికెట్ తీసుకున్నారు.

## జెమీమా 2.0.. రెండు నెలల్లో మారిపోయిన కెరీర్

రెండు నెలల ముందు వరకు జెమీమా రోడ్రిగ్స్ అంటే.. భారత మహిళల క్రికెట్ జట్టులో మిగతా ప్లేయర్లలాగే ఆమె కూడా ఒకరు. ఆమెను 'స్టార్' అని చెప్పలేని పరిస్థితి. టీమ్ ఇండియాలో ఆమెకు సుస్థిర స్థానమేమీ లేదు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో కూడా జెమీమా టాప్ ప్లేయర్ ఏమీ కాదు. కానీ ఇప్పుడు ఆమె భారత జట్టు సూపర్ స్టార్లలో ఒకరు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఆమె కెప్టెన్‌గా ఒక జట్టును నడిపించబోతోంది. తన కోసం బ్రాండ్లు క్యూ కడుతున్నాయి. ఇంతలోనే ఒక ప్లేయర్ కెరీర్లో ఇంత మార్పు రావడం అనూహ్యం. కొన్ని నెలల ముందు వరకు జెమీమా కెరీర్ ఏమంత గొప్పగా లేదు. ఆమెకు ఏ ఫార్మాట్లోనూ భారత జట్టులో సుస్థిర స్థానం లేదు. నిలకడ లేమి వల్ల జట్టులోకి వస్తూ పోతూ ఉండేది. ఏడేళ్ల కిందటే భారత జట్టులోకి వచ్చినప్పటికీ.. కెరీర్ ఆరంభంలో కొన్ని మెరుపుల తర్వాత నిలకడ తప్పింది. దీంతో గత వన్డే ప్రపంచకప్ (2021)లో ఆమెకు అవకాశం ఇవ్వలేదు సెలక్టర్లు. రెండేళ్లుగా తన ప్రదర్శనలో కొంచెం మెరుగుపడ్డా.. తుది జట్టులో స్థానం ఖాయం కాని పరిస్థితి. అక్టోబరులో వన్డే ప్రపంచకప్ మొదలయ్యాక కూడా గ్రూప్ దశలో ఆమెపై ఒక మ్యాచ్‌లో వేటు పడింది. అప్పటికి జట్టులో



ఆమెకు అంత ప్రాధాన్యం లేదు. వన్డేల్లో జెమీమా సగటు 35 కాగా.. టీ20ల్లో 30కి దగ్గరగా ఉండేది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ మాదిరి ఆమె స్టార్ ఇమేజ్ సంపాదించలేకపోయింది. కానీ, ఇదంతా వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్ జరగడానికి ముందు కథ.

**ఆ ఒక్క ఇన్నింగ్స్‌తో..**


2025 నవంబరు 2.. భారత మహిళల క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. ఆ రోజే హర్మన్‌ప్రీత్ సేన మహిళల వన్డే ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. అయితే జెమీమాకు కూడా ఈ తేదీ ఎంతో ప్రత్యేకమైందే కానీ.. ఆమె కెరీర్‌ను మలుపు తిప్పిన ఇంకో ముఖ్యమైన తేదీ ఉంది. అదే.. 2025 అక్టోబరు 30. ఆ రోజు జెమీమా ఆడిన ఆ ఒక్క ఇన్నింగ్స్ తనలో తనే గుర్తించని అపారమైన ప్రతిభను బయటికి తీసింది. ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టుపై ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత జట్టు 339 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించడంలో జెమీమా అద్భుత శతకానిది (127 నాటౌట్) అత్యంత కీలక పాత్ర. తనవల్లే ఆ రోజు ఇండియా గెలిచి ఫైనల్‌కు చేరింది. తుది పోరులోనూ అద్భుత విజయం సాధించడంతో కప్పు భారత్ సొంతమైంది. ఆస్ట్రేలియాపై జెమీమా ఆడిన ఇన్నింగ్స్‌తో క్రికెట్ ప్రపంచంలో తన పేరు మార్మోగింది. అయితే ప్రపంచకప్ ప్రదర్శన గాలివాటం కాదని రుజువు చేస్తూ.. ఆ టోర్నీ తర్వాత కూడా జెమీమా జోరు కొనసాగిస్తోంది. తాజాగా శ్రీలంకతో టీ20 సిరీస్‌లో జెమీమా అదరగొడుతోంది. తొలి మ్యాచ్‌లో 44 బంతుల్లోనే 69 పరుగులతో అజేయంగా నిలిచి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికైంది. రెండో మ్యాచ్‌లోనూ దూకుడుగా ఆడి 15 బంతుల్లో 26 పరుగులు చేసింది. మునుపెన్నడూ లేనంత ఆత్మవిశ్వాసం, దూకుడు తన ఆటలో కనిపిస్తోంది. లంకపై చెలరేగుతున్న సమయంలోనే జెమీమాకు తీపి కబురు అందించింది ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ. వచ్చే సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్‌లో డీసీకి జెమీమానే కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇప్పటివరకు ఆస్ట్రేలియా దిగ్గజం మెగ్ లానింగ్ ఆ జట్టును నడిపించింది. ఇప్పుడు 25 ఏళ్లకే జెమీమా ఆ జట్టు పగ్గాలు అందుకుంది. సీనియర్ స్థాయిలో తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్న జెమీమా.. తన నాయకత్వ లక్షణాలతో ఎలా మెప్పిస్తుందన్నది ఆసక్తికరం. ఇక్కడ సత్తా చాటుకుంటే భవిష్యత్తులో భారత జట్టు పగ్గాలు కూడా చేపట్టే అవకాశాలను కొట్టిపారేయలేం. ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ 37వ పడికి చేరువగా ఉంది. ఆమె కెరీర్ చరమాంకానికి వచ్చినట్లే. ఇంక ఎంతోకాలం ఆమె ఆటలో కొనసాగకపోవచ్చు. వైస్ కెప్టెన్ స్మృతి తన తర్వాత కెప్టెన్ కావచ్చు. అయితే ఆమె కూడా 30వ పడిలో ఉంది. కాబట్టి భవిష్యత్తులో సారథి కావడానికి జెమీమాకు మంచి అవకాశాలున్నట్లే.

**బ్రాండ్ వాల్యూ ట్రిపుల్**

ప్రపంచకప్ విజయానంతరం బ్రాండ్ విలువ అమాంతం పెరిగిన క్రికెటర్లలో జెమీమా కూడా ఒకరు. అంతకుముందు కూడా ఆమె కొన్ని బ్రాండ్లకు ప్రచారం చేసేది. కానీ ప్రపంచకప్ తర్వాత రెండంకెల సంఖ్యలో కొత్త ఒప్పందాలు చేసుకుంది జెమీమా. ఒక్కో బ్రాండ్ ప్రచారానికి ఆమె అందుకునే పారితోషకం మూడు రెట్లయిందట. ప్రస్తుతం హర్మన్ ప్రీత్, స్మృతి మంధాన తర్వాత జట్టులో పెద్ద స్టార్ జెమీమానే. మిగతా ఇద్దరిలాగే మూడు ఫార్మాట్లోనూ ఆమె జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. మేటి బ్యాటర్‌గానే కాక జట్టులో ఉత్తమ ఫీల్డర్‌గా ఆమె గుర్తింపు తెచ్చుకుంది. ప్రపంచకప్‌తో ఆమె ఆత్మవిశ్వాసం ఎంతో పెరిగింది. ప్రస్తుతం తన ఊపు చూస్తుంటే కెరీర్లో ఇంకా ఉన్నతస్థాయికి ఎదిగేలాగే కనిపిస్తోంది.


## కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ వ్యాపారంలోకి సునీల్ మిత్తల్

దిల్లీ: భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీల్ మిత్తల్ కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ వ్యాపారంలోకి ప్రవేశించారు. చైనాకు చెందిన హైయర్ గ్రూప్ అనుబంధ హైయర్ ఇండియాలో వాటాలను కొనుగోలు చేశారు. ఇందుకోసం ప్రముఖ ఈక్విటీ కంపెనీ వార్‌బర్గ్ పింకస్‌తో చేతులు కలిపారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్ కలిసి 49 శాతం వాటాను కొనుగోలు చేశాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ డీల్‌కు సంబంధించి ఆర్థిక వివరాలు మాత్రం వెల్లడి కాలేదు. దేశంలో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు, వాషింగ్‌మెషిన్లు, గృహోపకరణాలను హైయర్ ఇండియా విక్రయిస్తోంది. గడిచిన ఏడేళ్లుగా 25 శాతం సీఏజీఆర్‌తో వృద్ధి చెందుతోంది. ఈ డీల్ అనంతరం హైయర్ ఇండియాలో హైయర్ గ్రూప్‌నకు 49 శాతం వాటా ఉండనుంది. మిగిలిన 2 శాతం వాటా హైయర్ ఇండియా మేనేజ్‌మెంట్ టీమ్ వద్ద ఉంటుంది. ఈ




వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారత్‌లో హైయర్ ఇండియా మరింత విస్తరిస్తుందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ఆవిష్కరణల విషయంలో హైయర్‌కు ఉన్న నైపుణ్యం, భారతీ ఎంటర్‌ప్రైజెస్ సుస్థిరమైన నెట్‌వర్క్, బ్రాండ్‌లను విస్తరించడంలో వార్‌బర్గ్ పింకస్‌కున్న బలమైన ట్రాక్ రికార్డ్ హైయర్ ఇండియా వృద్ధికి దోహదం చేస్తుందని తెలిపాయి. హైయర్ ఇండియాలో పెట్టుబడుల ద్వారా కన్జూమర్ ఎలక్ట్రానిక్ మార్కెట్‌లో హైయర్ ఇండియా మార్కెట్‌ను మరింత విస్తరించాలని ఇరు కంపెనీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## 'ఐటీఆర్ హోల్డ్' సందేశాలపై గందరగోళం.. ఐటీ విభాగం క్లారిటీ





ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో గందరగోళం నెలకొంది. ట్యాక్స్ రిఫండ్లను హోల్డ్‌లో పెడుతున్నట్లు ఆదాయపు పన్ను విభాగం నుంచి గత కొన్ని రోజులుగా సందేశాలు వస్తుండడమే దీనికి కారణం. దీనిపై సామాజిక మాధ్యమాల వేదికగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై ఆదాయపు పన్ను విభాగం క్లారిటీ ఇచ్చింది. ఐటీఆర్ ఫైలింగ్‌లో పొరపాట్లకు ఆస్కారం, స్వచ్ఛందంగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను సమీక్షించుకోవాలనే ఉద్దేశంతో ఈ అలర్ట్‌లు పంపించినట్లు పేర్కొంది. ఆదాయపు పన్ను విభాగం ఇటీవల పన్ను చెల్లింపుదారులకు పెద్దఎత్తున సందేశాలు పంపింది. రిఫండ్ క్లెయిమ్స్‌లో వ్యత్యాసాల కారణంగా ఐటీ రిఫండ్‌ను హోల్డ్ చేశారన్నది ఆ సందేశాల సారాంశం. డిసెంబర్ 31లోపు రివైజ్డ్ రిటర్నులు సమర్పించాలని అందులో పేర్కొన్నట్లు పలువురు సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ఐటీఆర్ హోల్డ్‌లో పెట్టినట్లు తనకూ సందేశం వచ్చిందని, పూర్తి వివరాలు ఇమెయిల్‌లో పంపినట్లు అందులో ఉందని ఓ యూజర్ పేర్కొన్నాడు. అయితే అలాంటి ఇమెయిల్ ఏదీ తనకు రాలేదని తెలిపాడు. తీరా పోర్టల్‌లో చూస్తే 'మీ రిఫండ్ మీ ఖాతాలో క్రెడిట్ అయ్యింది' అని చూపిస్తోంది అని రాసుకొచ్చారు. పన్ను చెల్లింపుదారుల్లో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఆదాయపు పన్ను విభాగం వివరణ ఇచ్చింది. నడ్జ్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ సందేశాలు పంపినట్లు పేర్కొంది. కొందరు అర్హత లేకున్నా తప్పుడు మినహాయింపులు చూపించి రిఫండ్ కోసం క్లెయిమ్ చేసుకున్నారని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే ఐటీఆర్‌లో పేర్కొన్న మినహాయింపులను స్వచ్ఛందంగా సరిచూసుకోవాలన్న ఉద్దేశంతో ఈ సందేశాలు పంపినట్లు ఆదాయపు పన్ను విభాగం పేర్కొంది. అవసరమైతే 2025 డిసెంబరు 31లోగా సవరించిన ఐటీఆర్‌లు దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మినహాయింపు క్లెయిమ్‌లు సరిగ్గా ఉంటే ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని వివరించింది.




## భారత్‌లో రెండు విమానయాన సంస్థలకు అనుమతి

దేశంలో మరో రెండు విమానయాన సంస్థలకు పౌరవిమానయాన శాఖ అనుమతి ఇచ్చింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ సంస్థలకు అనుమతి ఇస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటికీ మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతరపత్రాలులభించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో సంస్థ శంఖ్ ఎయిర్‌కు ఇప్పటికే ఎన్‌ఓసీ వచ్చింది. దాంతో అది 2026 నుంచి కార్యకలాపాలను ప్రారంభించనుంది. కొన్ని వారాల క్రితం దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాల్లో తీవ్ర సంక్షోభం తలెత్తింది. దాంతో కొన్నిరోజుల పాటు వందల సంఖ్యలో సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఆ పరిస్థితులపై పార్లమెంట్‌లో మాట్లాడిన విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు. ఈ రంగంలో



గుత్తాధిపత్యానికి తాము తావివ్వడంలేదని, మరిన్ని విమానయాన సంస్థలను ఇందులోకి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కొత్త సంస్థలు అడుగుపెట్టడానికి ఇదే సరైన తరుణమని చెప్పారు. తాజాగా రెండు సంస్థలకు అనుమతి లభించినట్లు మంత్రి వెల్లడించారు. వేగంగా వృద్ధి చెందుతోన్న దేశీయ విమానయాన రంగంలో ఇండిగో, ఎయిరిండియాకు 90 శాతానికిపైగా వాటా ఉంది. ఒక్క ఇండిగో వాటానే 65 శాతం మేర ఉంది.

## భారీగా పెరిగిన బంగారం ధర.. 10 గ్రాముల ధర రూ.1.41లక్షలు పైనే



హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో రోజురోజుకు బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటుతూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,150కు చేరుకుంది. అటు వెండి కూడా పరుగులు పెడుతోంది. కేజీ ధర ఏకంగా రూ.2,25,393 పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఔన్సు బంగారం (Gold) ధర 4,495 డాలర్లు, వెండి ధర 72.22 డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో ఒక దశలో బంగారం ధర ఏకంగా 4500 డాలర్లను దాటడం గమనార్హం. ఈ ఉదయం స్పాట్ మార్కెట్‌లో ఔన్సు పసిడి ధర 4,507.27 డాలర్లకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పుత్తడి ధర దాదాపు 70శాతం వరకు ఎగబాకింది.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం.!

* బిఆర్ఎస్ పార్టీ భూ స్థాపితమే..
* కోవర్టుల మాట వింటే అగమయతరు.!
* అభివృద్ధి సంక్షేమం పై దృష్టి సారించాలి.!
* బంధుత్వం కంటే. కాంగ్రెస్ పార్టీనే ముఖ్యం.!
* గెలుపు గుర్రాలను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పాయం



మణుగూరు, డిసెంబర్ 24 (భారతశక్తి): భద్రాద్రి జిల్లాలో మూడు విడతలుగా జరిగిన స్థానిక ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం ప్రభంజనం సృష్టించిందని స్థానిక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జెడ్పి హై స్కూల్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ అధ్యక్షతన మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లతో అభినందన సభ ఏర్పాటు చేశారు. అభినందన సభకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్ధంగా నిర్వర్తిస్తూ, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ స్థానిక ఎన్నికల్లో కోవర్టులా వ్యవహరించి అభ్యర్థులను ఓడించేందుకే ప్రయత్నం చేసి స్థానిక ఎమ్మెల్యే ను బధనం చేయాలని చూశారని విమర్శించారు. 12 పంచాయితీలల్లో గెలవాల్సిన అభ్యర్థులు అంతర్గత కలహాల వలన స్వల్ప తేడాతో 3 పంచాయితీలల్లో ఓటమి చవిచూశారన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ తో పోటీ లేదని దానిని స్వార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు భూ స్థాపితం చేశారని ఆరోపించారు. అంతర్గత వర్గ పోరు, వెన్నుపోటు వలన ప్రజలు అయోమయంలో పడి మూడు పంచాయితీలు, కొన్ని వార్డులు ఓటమి చవిచూశాయని సుముఖం వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో గెలిపించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కోవర్టుల మాటలు వింటే అగమయతరని హితవుపలికారు. ఒకే కుటుంబంలో ఉంటూ కుళ్లు, కుంతంత్రాలతో రాజకీయాలు చేయాలని చుస్తే హై కమాండ్ దృష్టికి తీసుకెళ్లి సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా కుట్ర రాజకీయాలు చేయడం మాని కాంగ్రెస్ పార్టీ కోసం కల్మషం లేకుండా పని చేయాలని ఆయన కోరారు. గతంలో పనిచేసిన వారు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్నే కబ్జా చేయాలని చూశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ భూములను దోచుకున్న వాటి జోలికి మేము వెళ్లాలనుకోవడం కోవడం లేదన్నారు. కాకుంటే మా జోలికి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై బురద జల్లాలని చూసిన, కార్యాలయం అక్రమించుకోవాలని ప్రయత్నం చేసిన ఊరుకునే ప్రసక్తే లేదని సభ ముఖంగా హెచ్చరించారు. క్యాంపు కార్యాలయంకు వచ్చి లోపలకు వచ్చినప్పుడు ఒకలా.. బయటకు వచ్చినప్పుడు ఎలా మాట్లాడతారో నాకు తెలియదా అన్నారు. కోవర్టుల వలన మనం మూడు పంచాయితీలు ఒడిపోయామని తెలిపారు. సీనియర్లు, నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి సమిష్టిగా పని చేసి మంచి ఫలితాలు ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పల్లెపోరులో గెలిచిన గెలుపు గుర్రాలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఒడిన, గెలిచిన అభ్యర్థుల తరుపున ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల సంక్షేమ పథకాలు పక్షపాతం లేకుండా అర్హులైన పేదలకు అందేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో సీనియర్ నాయకుల సహకారంతో ఐక్యతగా పని చేస్తే రాబోయే రోజుల్లో వచ్చే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా గెలుపు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు పట్టణ అధ్యక్షుడు శివసైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, మహిళ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఐతనబోయిన సతీష్, యూత్ కాంగ్రెస్ నాయకులు సిరియాల చైతన్య నాయుడు, కాటబోయిన నాగేశ్వరావు, ఐఎన్ టీయుసి నాయకులు కృష్ణంరాజు, సామ శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, జిల్లా మహిళా కార్యదర్శి గడ్డి కనకలక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు భోగినేని వరలక్ష్మి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 24: క్రిస్మస్ పండుగ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ క్రైస్తవ సోదర , సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, కరుణ, సేవ భావాలను సమాజానికి అందిస్తుందన్నారు.యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలో స్ఫూర్తిగా నిలవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి తీసుకురావాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువులు ఎమ్మెల్యే ను కలసి క్రిస్టిమస్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఐదు సంవత్సరాల నా ప్రయాణంలో సహకార సంఘాలకు సేవ చేయడం నా అదృష్టం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి) డిసెంబర్24: సొసైటీ చైర్మన్ నుండి రాష్ట్ర స్థాయి చైర్మన్ వరకు నాకు గుర్తింపు తెచ్చిన మీ అందరికి రుణపడి ఉంటానని మాజీ టీజీ క్యాబ్,డీసీసీబీ అధ్యక్షులు మార్నేని రవీందర్ రావు అన్నారు. హన్మకొండ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మాజీ తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు మార్నేని రవీందర్ రావు, పాలకవర్గ సభ్యులకు డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్ అధ్యక్షతన, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ...

* ఐదు సంవత్సరాల నా ప్రయాణంలో సహకార సంఘాలకు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.
* సహకార అభివృద్ధి కోసం మీతో కలిసి పనిచేసే అవకాశం లభించడం గర్వంగా ఉంది.
* సొసైటీ చైర్మన్ నుండి రాష్ట్ర స్థాయి చైర్మన్ వరకు నాకు లభించిన అవకాశానికి నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి పెరుపేరున ప్రత్యేక ధన్యవాదాలు.
* 2020 ఫిబ్రవరి లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు గా పదవి బాధ్యతలు చేపట్టినప్పడినుండి ఈరోజు వరకు నా యొక్క బాధ్యతలను సొసైటీ నుండి రాష్టస్థాయి వరకు మార్గదర్శకంగా నిర్వర్తించడం జరిగింది.
* పదవి బాధ్యతలు తీసుకున్నపుడు ఉమ్మడి జిల్లాలో 19 శాఖలుగా ఉన్నా డీసీసీబీ బ్యాంకులు 39 శాఖలుగా విస్తరించడం గొప్ప విషయం.
* 860 కోట్ల ఉన్న బ్యాంకు టర్నోవర్ మా పాలకవర్గ ఆధ్వర్యంలో 2400 కోట్ల టర్నోవర్ సాధించడం జరిగింది.
* బ్యాంకు అధికారులు,ఉద్యోగస్తుల, మా సొసైటీ చైర్మన్ల కృషితో 7 శాతం ఉన్నటువంటి ఎన్ పి ఏ ను 2 శాతం కి తీసుకొనిరావడం జరిగింది..
* నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలోనే అత్యధిక నిధులు 50 కోట్ల వరకు మన బ్యాంకు కు తెచ్చుకోవడం జరిగింది.
* ఒక లక్ష రూపాయలు ఉన్న వ్యవసాయ రుణాల ఇన్సూరెన్స్ నీ 2 లక్షలకు పెంచుకోవడం జరిగింది.



* జిల్లాలో ఉన్న సహకార సంఘాల మంచి లాభాల బాటలో తీసుకుని వెళ్లడంలో ఆర్జించడం డీసీసీబీ బ్యాంకు సేవలు మరువలేనివి.
* ఎం ఎస్ సి లను నెలకొల్పడం,సంఘాలలో గోదాం, అగ్రి లేఔట్,కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణం, సూపర్ మార్కెట్ నెలకొల్పి సంఘాలను ఆర్థికంగా లాభాల బాటలో తీసుకుని వెళ్లడం జరిగింది..
* రైతులకు వ్యవసాయ రుణాలు, విద్య రుణాలు,వ్యాపార రుణాలు,మహిళలకు ఎస్ హెచ్ జి రుణాలు అందజేస్తూ వారిని ప్రోత్సహించడమే కాకుండా బ్యాంకును లాభాల బాటలో ముందుకు తీసుకెళ్లడం జరిగింది.
* ఎప్పుడూ లేనివిధంగా మా ఉద్యోగస్తులకు పి ఆర్ సి కానీ, లాభాలలో వారికి బోనస్ లు ఇస్తూ వారి శ్రమను గుర్తించడం జరిగింది.
* జిల్లా వ్యాప్తంగా అందరికీ మెరుగైన సేవలు అందిస్తూ చరిత్రలో నిలిచిపోయేలా బ్యాంకుకు పేరును గుర్తింపు తెచ్చుకున్నాం.

ఈ ఐదు సంవత్సరాల నాకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందజేసిన రాష్ట్ర ముఖ్యమంత్రీ రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మంత్రులకు,జిల్లా మంత్రులు సీతక్క,కొండ సురేఖ, శ్రీనివాస్ రెడ్,అద్దూరి లక్ష్మణ్ కు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, నాబార్డ్, టీజీ క్యాబ్ సిజిఎంలకు, ఉమ్మడి జిల్లా ఎంపీలకు,ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ప్రజా ప్రతినిధులకు, బ్యాంకు ఉద్యోగస్తులకు,రైతులకు,నా శ్రేయోభిలాషులకు పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.


## చట్టాలు, హక్కులపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి

**: డిఆర్వో విశ్వేశ్వర నాయుడు**



కడప, డిసెంబర్ 24(భారత శక్తి) : వినియోగదారులు వారి చట్టాలపై అవగాహన పెంచుకొని అమ్మకాలలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని గాంధీనగర్ నగర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం2025 జిల్లాస్థాయి వేడుకల్లో భాగంగా జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ 24వ తేదీ న నిర్వహించే జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ రోజు "డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం" అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమైనదన్నారు. వినియోగదారులు ఎంతో కష్టపడి కొన్న వస్తువు నాణ్యత లోపిస్తే వారు ఎంత మనస్తాపానికి గురవుతారో గ్రహించి ఆ ధోరణిలో మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువుపైన వినియోగదారుడికి చట్టపరమైన హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. 1986లో రూపు దిద్దుకున్న వినియోగదారుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత సమర్థవంతంగా "వినియోగదారుల రక్షణ చట్టం 2019"గా మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ మార్పు చెందిన చట్టం 2020 సంవత్సర ఆరంభం నుండి అన్ని రాష్ట్రాల్లో అమలులోకి వచ్చిందన్నారు. వినియోగదారులు తమ హక్కుల పట్ల ఎప్పటికప్పుడూ అవగాహన పెంచుకోవాలని డిఆర్వో సూచించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ జి.ఎం. బి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా కోర్టుకంటే వినియోగదారుల చట్టం ముందు ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయంటే వినియోగదారుల అవసరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. వినియోగదారుల సౌలభ్యం, సమయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం వర్చువల్ విధానంలో విచారణ, అలాగే డిజిటల్ పద్దతిలో సులభతరంగా ఫోరంకు నేరుగా ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కల్పించనుందన్నారు. తేదీ. 06, 11. 2020న అన్ని కోర్టులు వర్చువల్ మోడ్ కి మారడానికి అనుమతించాలని, డిజిటల్ కోర్టులకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్టికల్ 142 క్రింద సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ ఆచేసిందన్నారు. అందుకు తగిన విధంగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసిందని ఆ మేరకు వర్చువల్ హియరింగ్ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను డీఆర్వో వివరించారు. లీగల్ మెటరాలజీ అసిస్టెంట్ కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ 2024 లో అమలులోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ చట్టం ద్వారా కొలతలు, తూకాల్లో వచ్చే తేడాలు జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో వ్యాపారం విస్తృతం అవుతున్న నేపథ్యంలో చాలావరకు మోసం కూడా చొరబడుతోందని, ఇలాంటి సమయంలో వినియోగదారులుగా మనమే జాగ్రత్త పడి చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలను చైతన్య పరచడంలో మీడియా ప్రముఖ పాత్ర వహిస్తోందండని తెలిపారు. కావున మీడియా ద్వారా కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా ఇంచార్జి అధికారి రామచంద్ర మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ వ్యాపారి వద్ద ఏదో ఒక వస్తువు కొనాల్సిన అవసరం ఉంటుంది కావున మనం కొనే వస్తువు యొక్క స్థితిని గమనించడం మన బాధ్యత అన్నారు. వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, వస్తువు నాణ్యత ప్రమాణాలు, రుచి, వాసన తదితర వస్తువు యొక్క స్థితిని గమనించాలని తెలిపారు. ఏమైనా తేడాలు గమనించినట్లయితే వెంటనే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చాన్నారు. వీటన్నింటికంటే ముందుగా కొన్న ప్రతి వస్తువును బిల్లును స్వీకరించాలన్నారు. ముఖ్యంగా ఫుడ్ కలర్స్ లేని ఆహారాన్ని మాత్రమే.. ప్రజలు వియోగించాలని, ఫ్లేవర్ ఎన్ హేన్స్ (వాసనతో ఆకర్షించే)లను వినియోగించే పదార్థాలను వాడకపోవడం మంచిదన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రఘురామ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్తక వ్యాపారాల్లో వినియోగదారుడు చాలా విధాలుగా నష్టపోతున్నామని చెప్పవచ్చన్నారు. వినియోగదారులుగా మనం కొనే వస్తుపై మనకు పూర్తి స్థాయి హక్కు ఉందని తెలిపారు. ఎం ఆర్ పి రేటుకంటే అధిక ధరకు వస్తువును అమ్మితే వెంటనే కన్స్యూమర్ ఫోరమ్ కు ఒక్క కాల్ చేస్తే వస్తువు అమ్మకంలో ఎలాంటి మోసాన్ని అయినా అరికట్టవచ్చన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చాంద్ భాషా మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువు పైన లేబుల్ డిస్ప్లే ఉందా లేదా అని చూసుకుని కొనలన్నారు. అంతేకాకుండా మన చుట్టూ వున్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ద్వారా ఏవైనా నాణ్యత.లోపాలు, కాలుష్య భరితమైన ఉత్పత్తి అవుతుంటే వాటిపై కూడా వినియోగదారులు ఫోరమ్ కు వేసే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కమ్ అడ్వైజర్ పి.రమేష్ మాట్లాడుతూ వినియోగదారులు సాధారణ వస్తువులతో పాటు, ఆహార వస్తువుల విషయంలో కూడా తగు జాగ్రత్తలు నిర్వహించాలని సూచించారు. మన హక్కులను కాపాడుకోవడం మన ప్రధాన బాధ్యత అని అందుకు సంభందించి పలు ఉదాహరణలతో అవగాహన కల్పించారు. అనంతరం 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించిన, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత, పాఠశాల ఉపాధ్యాయులు, ఔషధ నియంత్రణ శాఖ, ఎపి వినియోగదారుల ఫోరం జిల్లా సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పౌర సరఫరాల డీలర్లు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

## పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్




కడప, డిసెంబర్ 24(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సెక్రటరీకం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: సీఎం ఆదేశం

అమరావతి, డిసెంబర్ 24 (భారత శక్తి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రైతులకు ప్రయోజనం చేకూరేలా రబీ ఖరీఫ్ రబీ పంటలకు సంబంధించిన క్యాలెండర్‌ను రూపొందించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పంటల హార్వెస్టింగ్, మార్కెటింగ్ ప్రక్రియలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో ధాన్యం సేకరణ, వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నిన్న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రబీ ఖరీఫ్ రబీ సీజన్లలో ఏయే పంటలు వేయాలి, రైతులకు ఏది లాభదాయకం అనే విషయాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. పంట ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని అన్నారు. కోల్డ్ చైన్ వ్యవస్థతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను తరలించేందుకు, వాటి ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని సీఎం సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లకు పంట ఉత్పత్తులను తరలించేందుకు వీలుగా రైల్ కార్గో వంటి లాజిస్టిక్స్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. వివిధ జిల్లాల్లో నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎదురవుతున్న బ్యాంకు గ్యారెంటీ సమస్యలను పరిష్కరించి, రైతులకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు సమీక్ష నుంచే రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కన్వీనర్‌తో ముఖ్యమంత్రి మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే తరహాలో బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వాలని సీఎం బ్యాంకర్లను ఆదేశించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి చేసే కొనుగోళ్లలో మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఈ సమీక్షకు మంత్రులు కె. అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వర్చువల్‌గా హాజరయ్యారు.

### న్యూ ఇయర్ వేడుకల వేళ..
## హద్దులు దాటితే కఠిన చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (భారత శక్తి): నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా చూడడానికి హైదరాబాద్ పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో న్యూ ఇయర్ ఈవెంట్లలో నిర్వాహకులు గానీ, ప్రజలు గానీ హద్దులు దాటినా లేక నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. "నిబంధనలు ఉల్లంఘిస్తే కొత్త సంవత్సరం సంతోషం లేకుండా పోతుంది" అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరంలో నిర్వహించే పార్టీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలపై సీపీ సజ్జనార్ క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఈవెంట్ జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే పార్టీల నిర్వహణకు ముందుగా పోలీస్ అనుమతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పొందాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకల్లో సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకే పూర్తిగా నిలిపివేయాలని సీపీ స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, 15 షీ టీమ్స్ బృందాలను మఫ్టీలో రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 అర్ధరాత్రి నగరమంతటా డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభమవుతాయని, అన్ని ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అయితే చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని హైదరాబాద్ పోలీసులు కోరుతున్నారు.

# ఆకాశమే హద్దు: ఇస్రో 'బాహుబలి' ఘన విజయం!

అమెరికా, డిసెంబర్ 24: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని అధిగమించింది. తన అత్యంత శక్తిమంతమైన 'బాహుబలి' రాకెట్ LVM3M6 ద్వారా అమెరికాకు చెందిన 'బ్లూబర్డ్ 6' ఉపగ్రహాన్ని బుధవారం విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జరిగిన ఈ ప్రయోగం భారతీయ అంతరిక్ష రంగ చరిత్రలో అతిపెద్ద వాణిజ్య విజయంగా నిలిచిపోయింది. ఉదయం 8:55 గంటలకు రెండో లాంచ్ ప్యాడ్ నుంచి 43.5 మీటర్ల ఎత్తున్న ఎల్వీఎం3 రాకెట్ గంభీరంగా నింగిలోకి ఎగిసింది. ప్రయాణం మొదలైన 15 నిమిషాలకే లక్ష్యానికి చేరుకుని, భూమికి 520 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. 6,100 కిలోల బరువున్న ఈ బ్లూబర్డ్ ఉపగ్రహం భారత గడ్డపై నుండి ప్రయోగించిన అత్యంత భారీ ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అమెరికాకు చెందిన 'ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్' రూపొందించిన ఈ ఉపగ్రహం ప్రత్యేకత ఏంటంటే.. దీనివల్ల ఎలాంటి అదనపు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్లకు నేరుగా అంతరిక్షం నుంచి 4G/5G బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుతాయి. ఈ ప్రయోగంలో ఒక ఆసక్తికరమైన మలుపు చోటుచేసుకుంది. ముందుగా ఉదయం 8:54 గంటలకే రాకెట్ బయలుదేరాల్సి ఉంది. కానీ రాకెట్ వెళ్లే మార్గంలో అంతరిక్ష వ్యర్థాలు, లేదా ఇతర ఉపగ్రహాలు ఢీకొనే ప్రమాదం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన ఇస్రో, కచ్చితమైన సమయ పాలనతో ప్రయోగాన్ని 90 సెకన్ల పాటు ఆలస్యం చేసి, 8:55 గంటల 30 సెకన్లకు ప్రయోగించింది. తద్వారా పెను ప్రమాదాన్ని నివారించి విజయాన్ని అందుకుంది. ప్రయోగం విజయవంతమైన తర్వాత ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ.. "ఎల్వీఎం3 రాకెట్ తన అద్భుతమైన ట్రాక్ రికార్డును మరోసారి నిరూపించుకుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ రాకెట్లలో ఇదొకటని నిరూపితమైంది" అని సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఇస్రో చేపట్టిన మూడవ పూర్తి స్థాయి వాణిజ్య మిషన్ కావడం విశేషం.

### నేను ఉన్నంత వరకు వారి కుటుంబాన్ని
## అధికారంలోకి రానివ్వను. ఇదే నా శపథం: సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 24 (భారత శక్తి): కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు. ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పుకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు. మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని అన్నారు.

### సర్పంచ్‌లకు తీపి కబురు..
## గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (భారత శక్తి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు తీపి కబురు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం ఇకపై సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని ప్రకటించారు. పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిధులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల జోక్యం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు అందుతాయని సీఎం స్పష్టం చేశారు. దీని ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. తన రాజకీయ ప్రయాణంలో కొడంగల్ ప్రజల సహకారాన్ని గుర్తు చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, "2009 నుంచి మీరు నన్ను మీ భుజాలపై మోశారు. మీ నమ్మకమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది" అని అన్నారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. గ్రామాల్లో వివక్ష లేకుండా పాలన సాగాలని, పార్టీలు పంతాలు పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

# ఆరావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం..
## రాష్ట్రాలకు కీలక ఆదేశాలు

డిసెంబర్ 24 (భారత శక్తి): ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పర్వత శ్రేణిలో కొత్తగా ఎలాంటి మైనింగ్ లీజులు మంజూరు చేయవద్దని పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న మొత్తం ఆరావళి ప్రాంతానికి ఈ ఆదేశాలు వర్తిస్తాయని కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (MoEF&CC) స్పష్టం చేసింది. అక్రమ, అనియంత్రిత మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు ఈ పర్వతాలను ఒకే భౌగోళిక వ్యవస్థగా పరిరక్షించడమే తమ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ నిషేధాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు గాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ICFRE)కు కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్న నిషేధిత ప్రాంతాలకు అదనంగా, మైనింగ్‌ను శాశ్వతంగా నిషేధించాల్సిన మరిన్ని ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించాలని ఆదేశించింది. అలాగే మొత్తం ఆరావళి ప్రాంతానికి 'సుస్థిర మైనింగ్ యాజమాన్య ప్రణాళిక'ను రూపొందించాలని సూచించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనుమతులతో నడుస్తున్న మైనింగ్ కార్యకలాపాలపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలని, పర్యావరణ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. భూగర్భ జలాలను పరిరక్షించడంలో ఆరావళి పర్వతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది.

# సంక్రాంతికి గ్రామాల్లో అన్నా క్యాంటీన్లు

విజయవాడ, డిసెంబర్ 24 (భారత శక్తి): గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికి పైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

# కిషన్ గ్రామీణ మేళాకు విశేష స్పందన

- అట్టహాసంగా మేళాను ప్రారంభించిన మాజీ గవర్నర్ బండారు
- కొత్త ఆవిష్కరణలకు రైతులు మొగ్గుచూపాలి




కరీంనగర్, డిసెంబర్ 24(భారతశక్తి ప్రతినిధి): రైతుకు భరోసా, ఆర్థిక ప్రగతి కోసం కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ గ్రామీణ మేళాకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. బుధవారం కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో కిషన్ జాగరణ్ అధ్యక్షులు, బీజేపీ జాతీయ నాయకులు పోల్సాని సుగుణాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ గ్రామీణ మేళాను మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా మాజీ గవర్నర్ ను డప్పు చప్పుళ్ళ మధ్య మేళా తాళాలతో నిర్వాహకులు ఆహ్వానించగా మేళాను రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళాలోనీ స్టాళ్లలో ఏర్పాటు చేసిన సీడ్స్, డైరీ, ఆర్గానిక్ స్టోర్స్ ను మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, జాగరణ్ అధ్యక్షులు సుగుణాకర్ రావులతో కలసి సందర్శించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ రైతులు సంఘటితంగా మార్పు చెందితే తద్వారానే వారి ఉత్పత్తులను వారు వస్తు మార్పిడి చేసి అధిక ధరలకు అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ భూములను భూసార పరీక్షలు చేసుకొని తగిన మోతాదులో ఎరువులు వాడటం వలన అధిక పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని సూచించారు. కొత్త కొత్త ఆవిష్కరణ రైతులు అందుబాటులో తీసుకురావాలని, అధిక ఉత్పత్తి సాధించే వంగడాలను రైతులు సాగుబాటు చేసుకోవడం వల్ల అధిక లాభాలు లాభాలు గడిచే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రజలు ఇప్పటికీ చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, దాని కారణంగానే పట్టణీకరణ జరుగుతుందని, గ్రామాలు ఆర్థిక స్వావలంబన కేంద్రాలుగా మారాలని, అప్పుడే దేశ ఆర్థిక స్థితి మెరుగవుతుందని చెప్పారు. కిసాన్ జాగరణ అధ్యక్షులు, నిర్వాహకులు పొలసాని సుగుణాకర్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆర్థిక సామాజిక పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుందని అభివృద్ధి పొలాలు గ్రామ ప్రజలకు అందటం లేదని దాని మూలంగా యువత వ్యవసాయ రంగం వైపు ఇతర చేతివృత్తుల పైపు మరలకుండా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల వైపు నగరాలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారని ఈ పరిణామం రాబోయే రోజుల్లో దుష్ప్రమణలకు దారితీస్తుంది ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల ఆర్థిక సామాజిక,రైతుల యొక్క ఆర్థిక పరిస్థితి మెరుగుకై వారిని చైతన్యపరచుటకై కిసాన్ జాగారం 2022, 23 ఈ సంవత్సరంలో కిసాన్ గ్రామీణ మేళాలను వైభవంగా నిర్వహిస్తున్నామనీ చెప్పారు. నూతన శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని అలాగే అధిక ఉత్పత్తి చేసే విత్తనాలు నూతన పద్ధతులు ద్వారా అధిక పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని ఆ అధిక పంటలు పండించుకునేందుకు రైతులు చైతన్యపరిచే లక్ష్యమే కిసాన్ గ్రామీణ మేళా అన్నారు. గ్రామీణ ప్రజలు, యువకులు వ్యవసాయం పట్ల ఆసక్తి చూపటం లేదని దానివల్ల వ్యవసాయ రంగము తీవ్రంగా నష్టపోతుందని యువత వ్యవసాయ రంగం వైపు ఆకస్థితుల ఏవిధంగా జాగ్రత్తపరచడమే ఈ కిసాన్ గ్రామీణ మేళా లక్షణం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాజేశ్వర రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం కొరకు కిసాన్ గ్రామీణ మేళా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని కూడా లాభదాయకంగా మార్చాలని ప్రయత్నం ఈ కిసాన్ గ్రామీణ మేలని ఇలాంటి గ్రామీణ మేళాలు రైతులను చైతన్య పరిచే కార్యక్రమాలు మరిన్ని జరపవలసిన అవసరం ఉందని తెలిపారు కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ డైరీ 12000 సభ్యత్వంతో ప్రారంభమై ఈ రోజు లక్షకు పైగా సభ్యులతో తెలంగాణలోనే అత్యధిక పాలు పాల ఉత్పత్తులు వ్యాపారం చేస్తే సంస్థగా ఎదిగింది అని తెలిపారు. రైతులకు, పశు పోషణను ప్రోత్సహించాలని ఉద్దేశంతో కిసాన్ గ్రామీణ మేళాను నిర్వహిస్తున్నారని, ఇలాంటి మేళాలు ఇంకా ఎన్నో నిర్వహించి రైతులతో పాటుగా చేపలు, గొర్రెల పెంపకం డైరీ రైతులను ప్రోత్సహించవలసిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎంపీ ఓ అధ్యక్షులు, పిఎసిఎస్ అధ్యక్షులు, వివిధ సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

# బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన చిప్పలపల్లి గ్రామస్తులు

* **చిప్పలపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులని ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి**

మీర్ పేట్, డిసెంబర్ 24 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన వారందరినీ మీర్ పేట్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్ సురమోని లలిత కుమార్ ముదిరాజ్, ఉప సర్పంచ్ ఎర్ర లావణ్య ప్రవీణ్, వార్డ్ సభ్యులు, పి యాదగిరి, జి హరికృష్ణ చారి, పి కవిత సురేష్, ఆర్ బాలకృష్ణ, మానస నరసింహ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ పిమ్మట వారితో పాటు వచ్చిన పలువురు బీజేపీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.చిప్పలపల్లి గ్రామ తాజా సర్పంచ్ సురమోని లలిత కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో,మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకొని పార్టీ లోకి చేరారు.ఈ చేరికల్లో పి. యాదగిరి, మానస నరసింహ, జి. హరికృష్ణ చారి, బిక్షపతి, యాదయ్య, శ్రీను, వెంకటేష్, ఎర్ర శేఖర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.వారికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు.ఈ




సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రెండు సంవత్సరాలు మాత్రమే కొనసాగుతుందని, మళ్లీ ప్రజల పరిపాలన, బీఆర్ఎస్ పాలన త్వరలోనే రాబోతుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు మండల అధ్యక్షులు మన్నే జయేంద్ర ముదిరాజ్,మాజీ సర్పంచ్ శేఖర్ స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీపై మండిపడిన తెలంగాణ జాగృతి నాయకులు

షాద్ నగర్, డిసెంబర్ 24 (భారత శక్తి): షాద్‌నగర్ నియోజకవర్గ తెలంగాణ జాగృతి ఇంచార్జ్ చీమల రమేశ్,తెలంగాణ జాగృతి సీనియర్ నియోజకవర్గ నాయకులు చలసాని విష్ణుమూర్తి, నాగని ప్రకాశ్ తో కలసి బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమ నినాదంలో నీళ్ళు, నిధులు, నియమకాలు అందులో 'నీళ్లు' మొదటి అంశం.కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలన అనంతరం వెనక్కి తిరిగి చూస్తే దక్షిణ తెలంగాణకు గుండెకాయ వంటి 'పాలమూరు రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం కేవలం ఒక రాజకీయ నినాదంగానే ఉండి పోయిందే తప్ప ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి, జిల్లా ప్రజలకు పెద్దగా ఒనగూరిందేమి లేదన్నది నిజం. బీఆర్ఎస్ హయాంలోనే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేశామని చెప్పుకొనే బిఆర్ఎస్, పాలమూరు ప్రాజెక్టును మాత్రం పదేళ్ల పాటు పాతరేశారని వారు మండి పడ్డారు. ఇప్పుడు నిద్రలేసిన బిఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అవలంబిస్తున్న విధానం వల్ల 90 టీఎంసీల నుంచి 45 టీఎంసీలకు తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రల వల్ల జిల్లాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని మొసలి కన్నీరు కారుస్తు రాజకీయ ఉనికి కోసం మభ్యపెడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్, బీజేపీతో ఉన్న స్నేహాన్ని కేవలం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే తప్ప, తెలంగాణ ప్రాజెక్ట్ కు అనుమతుల కోసం ఒత్తిడి చేయలేదని అన్నారు. కేంద్రం పాలమూరు డీపీఆర్ ను వెనక్కి పంపిందంటే దానికి కారణం బిఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని వారు మండిపడ్డారు.

## పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై
### సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కీలక సమావేశం

మీర్ పేట్, డిసెంబర్ 24 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి మీర్పేట్ సామ యాదిరెడ్డి గార్డెన్లో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు అంశంపై రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ముఖ్య నేతలతో కీలక నేతలు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, హరీశ్వర్ రెడ్డి, మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్ రెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ కుమార్, సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి చేసిన ముఖ్య వ్యాఖ్యలు: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై తొలిసారిగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించాం.పాలమూరు ప్రాజెక్టుపై కేసీఆర్ చెప్పిన వాస్తవాలను పక్కన పెట్టి కాంగ్రెస్ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశాం. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.90 శాతం పనులు పూర్తయినా మిగిలిన 10 శాతం పనులను ఎందుకు పూర్తి చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పాలమూరు



ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసి, కనీసం చర్చ కూడా చేయలేదు."పాలమూరు బిడ్డ"నని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు.తెలంగాణ రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం రెండు అతిపెద్ద ప్రాజెక్టులు ప్రారంభించింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కేసుల కారణంగా ఆలస్యం జరిగింది, లేకుంటే ఎప్పుడో పూర్తయ్యేది.అన్ని కేసులు కొట్టివేసిన తర్వాత 30 వేల కోట్ల రూపాయలతో కేసీఆర్ పాలమూరు పనులకు శంకుస్థాపన చేశారు.27 వేల కోట్లతో రిజర్వాయర్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా రెండు కిలోమీటర్ల కాలువ తవ్వితే నీళ్లు వస్తాయని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు.పాలమూరు ప్రాజెక్టు పూర్తైతే 7 నియోజకవర్గాలకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూపాయి కూడా కేటాయించలేదు, తట్ట మట్టి కూడా తీయలేదు.45 టీఎంసీలు సరిపోతాయని మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాశారో ప్రజలకు చెప్పాలి.గత 10 ఏళ్లలో కేసీఆర్ రైతులకు ఉచిత కరెంట్, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందించారు. కేసీఆర్‌ను విమర్శించడమే కాదు, ముందుగా మిగిలిన పనులు పూర్తి చేయాలి.కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా కూలిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారు.సీఎం తన సొంత నియోజకవర్గానికి మాత్రమే నీళ్లు తీసుకెళ్లాలని చూస్తున్నారా? మిగతా నియోజకవర్గాలకు నీళ్లు అవసరం లేదా అని ఘాటుగా స్పందించారు. ఈ అంశంపై కెసిఆర్ అధ్యక్షతన మా కార్యచరణ కొనసాగుతుందని తెలిపారు.

## జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సిద్ధార్థ

* **అభినందించిన విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీపాల్ రెడ్డి**

కరీంనగర్, డిసెంబర్ 24(భారతశక్తి ప్రతినిధి): తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్ర వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలో సిద్ధార్థ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారు. ఈ నెల 8, 9 వ తేదీలలో ఆదిలాబాద్ లోని ఓక్లీ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో 9వ తరగతి చదువుతున్న కె. భువన్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎన్నికయ్యాడు. స్విమ్మర్స్ ఈ నెల 27 నుండి 29 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం అక్వాటిక్ కాంప్లెక్స్ లో జరుగుతున్న, తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ 36వ సౌత్ జోన్ అక్వాటిక్ ఛాంపియన్ షిప్ 2025 పాల్గొననున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని



పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్ రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని విద్యార్థినుద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి లో మహబూబ్ సాగర్ చెరువు లో చేప పిల్లలను వదిలిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 24: సంగారెడ్డి పట్టణం లోని మహబూబ్ సాగర్ చెరువు లో బుధవారం టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ చేప పిలల్లను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కారుల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా లెక్కలేని విధంగా కాకుండా, నాణ్యమైన చేప విత్తనాలను అందిస్తుందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వం లో భవిష్యత్ లో మత్స్యకారుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖా అధికారులు, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్ మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు నగేష్, చిదంబర సాయి, రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సిడెంట్ ఫ్రీ ఇయర్

* **మంచి వాతావరణంలో వేడుకలు: సీపీ సుధీర్ బాబు ఆశాభావం**
* **డ్రగ్స్ వినియోగం మీద ఉక్కు పాదం**
* **మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు**
* **నూతన సంవత్సర వేడుకల్లో ఔట్ డోర్ ఈవెంట్లలో డీజే సౌండ్ కు అనుమతి లేదు**



రాచకొండ, డిసెంబర్ 24 (భారత శక్తి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాచకొండ పరిధిలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి బుధవారం రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు కమిషనరేట్ పరిధిలోని పబ్ లు, బార్లు, రెస్టారెంట్స్, ఫామ్ హౌస్ లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పరిధిలోని డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, అన్ని పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ,ఇన్సిడెంట్ ఫ్రీ న్యూ ఇయర్ గా జరుపుకోవాలని కోరుకుంటున్నాను. ఆరోజు ఒక్క యాక్సిడెంట్ కూడా జరగకూడదు.. ఏ ప్రాణం పోగూడదు, భూమిపై రక్తం చిందకూడదనీ కోరుకుంటున్నానని ఆశించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ఈ వేడుకలలో ప్రజలు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారని, కాబట్టి శాంతి భద్రతల సమస్య రాకుండా అన్ని రకాల పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్, ఎస్ఓటి,షీ టీమ్స్, పెట్రోలింగ్ వంటి పోలీసు బృందాలు వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు, నేరాలు జరగకుండా విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.ఔట్ డోర్ కార్యక్రమాలు జరిగే చోట డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదని, ఎటువంటి బాణాసంచా కాల్చడానికి వీల్లేదని, పరిమితికి మించి ఈవెంట్ లోకి ప్రేక్షకులను అనుమతించకూడదని పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా నిరోధించడానికి తమ షీ టీమ్ బృందాలు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తమ బృందాలు తనిఖీలు చేస్తారని, నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల మీద ఉక్కుపాదం మోపుతున్నామని ఈ సంధర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పబ్ లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయంలోపు మూసివేయాలని, మైనర్ యువతకు మద్యం అమ్మే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్ కు సరైన ఏర్పాట్లు చేయాలని, షాపులు, పబ్ లు, రెస్టారెంట్ ల పరిసరాల్లో సీసీటీవీలు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగర శివార్లలో ఉండే ఫామ్ హౌస్ లలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు కూడా నిబంధనలకు లోబడి ఉండాలని, ఎటువంటి డ్రగ్స్ వినియోగం జరగకూడదని, మహిళలతో అసభ్యకర డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించకూడదని పేర్కొన్నారు. రోడ్ల మీద ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, ఎటువంటి బైక్ రేసులు చేయకుండా ఉండేందుకు నిర్దేశిత సమయం పాటు తాత్కాలికంగా ఫ్లైఓవర్ లను మూసివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్, యాదాద్రి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఎస్ఓటి డీసీపీ రమణా రెడ్డి, డీసీపీ అడ్మిన్ ఇందిర, ఎస్బి డీసీపీ జి నరసింహారెడ్డి, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా రాణి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, డీసీపీ హెడ్ క్వార్టర్ శ్యామ్ సుందర్,ఇతర అధికారులు, పోలీస్ స్టేషన్ల సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.